RNI Regd. APTEL No. 2009/29147 Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి

జాతీయ తెలుగు వార పత్రిక

సంపుటి : 15 సంచిక : 32 ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా తేది : 19-04-2024 పేజీలు : 8 వెల : 6/-



## దేశ అభివృద్ధి, శ్రేయస్సు, యువత, మహిళలు, పేదలు, రైతులే ప్రధాన అజెండాగా...


# బీజేపీ నూతన ఎన్నికల మ్యానిఫెస్టో




దేశ అభివృద్ధి, శ్రేయస్సు, యువత, మహిళలు, పేదలు, రైతులే ప్రధాన అజెండాగా బీజేపీ తన నూతన ఎన్నికల మ్యానిఫెస్టో 'సంకల్ప పత్రం.. మోదీ గ్యారెంటీ'ని ఇటీవల విడుదల చేసింది. వికసిత భారతే తమ లక్ష్యమని పేర్కొన్నది. కానీ, 2014లో కూడా బీజేపీ ఇలాంటి వాగ్దానాలతోనే నమ్మబలికి అధికారంలోకి వచ్చింది. అప్పుడు ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ఎన్ని హామీలు నెరవేర్చారు? అన్నది నూతన మ్యానిఫెస్టోలో ఎక్కడా ప్రస్తావించలేదు. 90 శాతం హామీలను అమలు చేశామని ఒక్క ముక్కలో తేల్చేశారు. వెయ్యేండ్ల అభివృద్ధికి సరిపడా ఎజెండాతో నూతన మ్యానిఫెస్టో తయారు చేశామని మోదీ మరోసారి గప్పాలు కొడుతున్నారు. బీజేపీ 2014లో ఇచ్చిన హామీలు ఎంతమేరకు అమలు చేసిందో? గడిచిన పదేండ్ల పాలనలో మోదీ సర్కార్ సాధించిన ప్రగతి ఎంత అనేది గణాంకాలతో సహా గమనిస్తే అసలు కథ అర్థమవుతుంది. యువతకు ఉపాధి కల్పించడంలో గత కాంగ్రెస్ పాలకులు ఘోరంగా విఫలమయ్యారని, తాము అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను నమ్మించి నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చారు. ఈ లెక్కన గడిచిన పదేండ్లలో ఏడాదికి 2 కోట్ల చొప్పున మొత్తం 20 కోట్ల ఉద్యోగాలు కాదు కదా కనీసం 2 కోట్ల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోయింది మోదీ ప్రభుత్వం. గడిచిన 40 ఏండ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయింది. ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతీ యువకుల్లో 45 శాతం మంది నిరుద్యోగులే. అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని, తాము అధికారంలోకి రాగానే ధరలు తగ్గిస్తామని వాగ్దానం చేశారు. కానీ, ధరలను ఏవిధంగా, ఎంతమేరకు తగ్గించి సామాన్యుడికి అందుబాటులోకి తెచ్చారో మ్యానిఫెస్టోలో ఎక్కడా ప్రస్తావించలేదు. 2014-2024 వరకు కన్స్యూమర్ ఇండెక్స్ ప్రైస్ గణాంకాలను పరిశీలిస్తే.. గత పదేండ్లలో ధరలు తగ్గడం అటుంచి 70 శాతానికి పైగా పెరిగినట్టు తెలుస్తున్నది. అదేవిధంగా 2014లో రూ.300 ఉన్న సిలిండర్ ధర నాలుగు రెట్లు పెరిగి రూ.1150కి చేరింది. అప్పట్లో లీటర్ డీజిల్ రూ.55, పెట్రోల్ రూ.66 ఉండేవి. అవి ప్రస్తుతం సెంచరీకి చేరుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే.. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలలో టర్కీ తర్వాత మన దేశం రెండో స్థానంలో ఉన్నట్లు గ్లోబల్ ఇండెక్స్ రిపోర్ట్ తెలియజేస్తున్నది. దీన్నిబట్టే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. రైతుల ఆదాయం రెండింతలు చేస్తానని చెప్పిన మోదీ దాని గురించి అసలు ప్రస్తావించలేదు. పైగా ఈ పదేండ్లలో

(తరువాయి 2వ పేజీలో)

## నెల్లూరులో... ప్రచారంలో పోటాపోటీగా వైసిపి, టిడిపి..!




నెల్లూరు జిల్లాలో హోరాహోరీ ఎన్నికల వేడి సాగుతోంది. టిడిపి, వైసిపి నువ్వా నేనా అన్నట్లు ప్రచారంలో దూసుకు పోతున్నాయి. జిల్లాలో ఒక పార్లమెంటు, 8 అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి టిడిపి తరపున వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి తరపున విజయసాయిరెడ్డి పోటీ పడుతున్నారు. ఇద్దరు ఎంపిలు నెల్లూరు జిల్లా వాసులే. ఇద్దరు నెల్లూరు పెద్దారెడ్లు, ఆర్థికంగా బలమైన వ్యక్తులు రావడంతో రాష్ట్ర రాజకీయాలు మొత్తం సింహపురి వైపు చూస్తున్నాయి. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా వ్యక్తులు పోటీపడుతున్నారు. నగదు వరదల్లా పారుతుంది. కందుకూరు టిడిపి అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు, వైసిపి అభ్యర్థిగా బుర్రా మధుసూదన్‌యాదవ్, ఇండియా ఫోరం అభ్యర్థిగా గౌస్ మొహిద్దీన్ రంగంలో ఉన్నారు. టిడిపి అభ్యర్థి కొత్తవారు కావడంతో సీనియర్లు వ్యతిరేకిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్, పోతుల రామారావు ఆయనను వ్యతిరేకిస్తున్నారు. ఇంటూరి సోదరుడు ఇంటూరి రాజేష్ కూడా వ్యతిరేకిస్తున్నారు. టిడిపికి అనుకూల పరిస్థితులున్నప్పటికీ గ్రూపులతో ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి అభ్యర్థిగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ కందుకూరు నుంచి పోటీలో ఉన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి వ్యతిరేకిస్తున్నా మౌనంగా ఉన్నారు. కావలి నుంచి వైసిపి అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టిడిపి నుంచి కొత్త అభ్యర్థి కావ్యకృష్ణారెడ్డి పోటీ పడుతున్నారు. నిన్నటి వరకు వైసిపికి దూరమైన మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లెమాల సుకుమార్‌రెడ్డి వైసిపిలో చేరారు. దీంతో ఆ పార్టీకి కొంత కలిసి వచ్చింది. టిడిపి కొత్త అభ్యర్థికి టికెట్ ఇవ్వడంతో కొందరు నాయకులు కావ్యకృష్ణారెడ్డికి అనుకూలంగా పనిచేయడం లేదని తెలుస్తోంది. ఉదయగిరి నుంచి టిడిపి తరపున ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్, వైసిపి తరపున మేకపాటి రాజారెడ్డి పోటీ పడుతున్నారు. ఇద్దరు కొత్త అభ్యర్థులే. టిడిపిలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు గ్రూపు కాకర్ల సురేష్‌కు సహకరించడం లేదు. స్థానికంగా సమన్వయ లోపం కనిపిస్తుంది. వైసిపి అభ్యర్థి విషయంలో మేకపాటి కుటుంబంలో విభేదాలున్నాయి. ఇండియా ఫోరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ కుమార్‌రెడ్డి పోటీలో ఉన్నారు. ఆత్మకూరు నుంచి మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి టిడిపి తరపున రంగంలో ఉన్నారు. ప్రస్తుతం వైసిపి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పోటీలో ఉన్నారు. విక్రమ్‌రెడ్డి గత కొంత కాలంగా నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తుతం వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. నిన్నమొన్నటి వరకు వెంకటగిరి నుంచి పోటీ చేస్తారని భావించారు. అందువల్ల ఆనం రామనారాయణరెడ్డి పెద్దగా నియోజకవర్గంలో తిరగలేదు. ఇటీవల ఆత్మకూరు అభ్యర్థిగా ప్రకటించడంతో ప్రస్తుతం నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటున్నారు. వీరిద్దరి మధ్య గట్టి పోటీ నెలకొంది. ఇండియా ఫోరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు శ్రీధర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. కోవూరు వైసిపి నుంచి ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పోటీలో ఉన్నారు. కొత్త అభ్యర్థిగా టిడిపి నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతరెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రావడంతో ప్రసన్నతోపాటు నడిచిన అనేకమంది నేతలు టిడిపిలో చేరారు. నెల్లూరు టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి పి నారాయణ పోటీలో ఉన్నారు. వైసిపి నుంచి కొత్త అభ్యర్థి ఖలీల్ అహ్మద్

(తరువాయి 3వ పేజీలో)

www.andhralaxmitelugu.in వెబ్‌సైట్‌లో వార్తలు చూడండి!

# నెల్లూరులో... వైసిపి పూర్వవైభవం నిలుపుకొనేనా...?

వైసీపీకి రాయలసీమతో సమానంగా ఆదరిస్తున్న జిల్లా నెల్లూరు. పార్టీ ఆవిర్భావం నుంచి జగన్ వెంట నడిచిన జిల్లా కూడా ఇదే. 2014 ఎన్నికల్లో పది నియోజకవర్గాలకు గాను ఎనిమిది చోట్ల,2019 ఎన్నికల్లో పదికి పది నియోజక వర్గాలను వైసీపీ గెలుచుకుంది. అయితే ఈసారి ఆ హవా ఉంటుందా? లేదా? అన్న బలమైన చర్చ నడుస్తోంది. గత రెండు ఎన్నికల్లో కలిసి వచ్చిన ఏ అంశాలు.. ఈ ఎన్నికల్లో వైసీపీకి కనిపించడం లేదు. బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలన్నీ వైసీపీకి దూరమయ్యాయి. జగన్ చేజేతులా దూరం చేసుకున్నారు. దీంతో నెల్లూరులో వైసీపీకి దారుణ దెబ్బ తప్పదన్న విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. గత ఎన్నికల్లో నెల్లూరు జిల్లాలో వైసీపీ వైట్ వాష్ చేసింది. ఆనం ఫ్యామిలీ, మేకపాటి ఫ్యామిలీ, నేదురుమల్లి ఫ్యామిలీ, వేమిరెడ్డి ఫ్యామిలీ.. ఇలా బలమైన కుటుంబాలన్నీ వైసిపికి అండగా నిలిచాయి. పదికి పది సీట్లు గెలుచుకునేలా దోహదపడ్డాయి. కానీ ఎన్నికల్లో మిగిలింది ఒక్క మేకపాటి ఫ్యామిలీ మాత్రమే. అయితే ఆ ఫ్యామిలీలో మేకపాటి గౌతంరెడ్డి చనిపోవడం, చంద్రశేఖర్ రెడ్డి కుటుంబానికి దూరం కావడం మైనస్‌గా మారింది.




వయోభారంతో రాజమోహన్ రెడ్డి బాధపడుతుండడంతో ఆయన సైతం చురుగ్గా ప్రచారంలో పాల్గొనలేకపోతున్నారు. తమ కుటుంబానికి ఇచ్చిన ఆత్మకూరు, ఉదయగిరి నియోజక వర్గాలను గెలిపించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అక్కడ ఈసారి వైసీపీకి దెబ్బ తప్పదు అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. నెల్లూరు సిటీలో మాజీ మంత్రి నారాయణ పోటీ చేస్తుండడంతో వార్ వన్ సైడ్ గా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఆయన కేవలం 700 ఓట్ల తేడాతోనే ఓడిపోయారు. రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఏకపక్ష విజయం సాధించనున్నారు అన్న విశ్లేషణలు ఉన్నాయి. కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ వ్యవహార శైలితో వైసీపీ ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటుంది. ఇక్కడ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భార్య ప్రశాంతి రెడ్డి పోటీ చేస్తున్నడంతో సీన్ మారింది. అంతటా అనుకూలంగా టిడిపికి మారిపోయింది. వెంకటగిరిలో సైతం టిడిపి వైపు మొగ్గు కనిపిస్తోంది. ఆనం మద్దతు పుష్కలంగా లభిస్తుండడంతో కూటమిదే పై చేయిగా కనిపిస్తోంది. కావలిలో రామిరెడ్డి నిర్వాకాలపై ప్రజల్లో అసంతృప్తి ఉంది. అక్కడ టిడిపి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి దూసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ నుంచి టీడీపీలోకి వేమిరెడ్డి దంపతులు వచ్చిన తర్వాత పూర్తిగా సీన్ మారిపోయింది. ఆయనేమీ మాస్ లీడర్ కాదు. అయినా సరే ఆయనతోపాటు వైసీపీ క్యాడర్ భారీగా టిడిపిలో చేరింది. చివరి నిమిషంలో అభ్యర్థి దొరకకపోవడంతో విజయసాయిరెడ్డిని జగన్ బరిలో దించాల్సి వచ్చింది. అటు విజయ్ సాయి రెడ్డికి సైతం గెలుపు పై పెద్దగా హోప్స్ లేనట్లు తెలుస్తోంది. అయితే నెల్లూరులో నష్టాన్ని ఊహించిన వైసిపి కొత్త ప్రచారాన్ని తెరతీసింది. వేమిరెడ్డి దంపతులు తిరిగి వైసీపీలో చేరనున్నట్లు ప్రచారం ప్రారంభించారు. దానిపై వేమిరెడ్డి దంపతులు స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు. అయితే ఈసారి ఎన్ని చేసినా నెల్లూరులో వైసీపీకి ప్రతికూల ఫలితాలు తప్పవని తెలుస్తోంది. 10 సీట్లకు గాను ఒకటి రెండు చోట్ల గెలుపొందితే.. అదే భాగ్యమన్న నిర్ణయానికి వైసిపి వచ్చినట్లు సమాచారం. అయితే ఇక్కడ టిడిపి బలపడింది అనే దానికంటే వైసిపి పూర్వ వైభవం నిలుకునేనా అని పలువురు చర్చించుకొంటున్నారు..!

## దేశ అభివృద్ధి, శ్రేయస్సు, యువత, మహిళలు, పేదలు, రైతులే ప్రధాన అజెండాగా...

(1వ పేజీ తరువాయి)

1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అధికారిక లెక్కలు చెప్తున్నాయి. అంటే సగటున రోజుకి 30 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతుల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడం పక్కనపెడితే.. రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి దాదాపు 750 మందికి పైగా అన్నదాతల మృతికి కారణమైంది బీజేపీ సర్కార్. నల్లచట్టాలను వెనక్కి తీసుకుంటున్నామని మోదీ ప్రకటించినప్పుడు పంటకు కనీస మద్దతు ధర దక్కేలా చట్టం చేస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మద్దతు ధర కోసం మరోసారి రైతన్నలు రోడ్డెక్కి నిరసనలు చేసినా మోదీ సర్కార్ పట్టించుకోవడం లేదు. నరేంద్రమోదీ పాలనలో రైతుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నది. అదానీ, అంబానీల ఆదాయం మాత్రం రెట్టింపవుతున్నది. విద్యావిధానం సమూలంగా ప్రక్షాళన చేస్తామన్న హామీని అటకెక్కించారు. అదీకాకుండా 2014 నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. ఆయుష్మాన్ భారత్ గురించి గొప్పలు చెప్తున్న బీజేపీ గతేడాది రూ. 8 వేల కోట్లు ఆ పథకం కోసం ఖర్చు చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీ రూ. 9.5 వేల కోట్లను ఆరోగ్య రంగంపై ఖర్చు చేస్తుండటం గమనార్హం. మోదీ పాలనలో రూపాయి విలువ మరింత క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయిలో 82కి పడిపోయింది. మరోవైపు 2014లో రూ. 55.87 లక్షల కోట్లుగా ఉన్న దేశ అప్పు ఈ పదేండ్లలో రూ. 155.31 లక్షల కోట్లకు పెరిగింది. భారీఎత్తున అప్పులు చేసిన మోదీ సర్కార్ ఏమైనా అభివృద్ధి చేసిందా? అంటే అదీ లేదు. మోసపూరిత వాగ్దానాలు, హామీలతో దేశ ప్రజలను వంచించారు. ఈ పదేండ్ల తిరోగమన పాలన చాలదన్నట్టు.. మళ్లీ వికసిత భారతం అంటూ మాయమాటలతో ప్రజల ముందుకువస్తున్నారు.

## ప్రభుత్వ సలహాదారులకూ ఎన్నికల కోడ్ వర్తింపు.. స్పష్టం చేసిన ఈసీ




ప్రభుత్వ సలహాదారులకూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని స్పష్టం చేసింది కేంద్ర ఎన్నికల కమిషన్.. కార్యనిర్వాహక ఉత్తర్వులతో నియమితులై కేబినెట్ మంత్రి హోదాలో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీత భత్యాలు పొందుతున్న వారికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని పేర్కొంది.. దాదాపు 40 మంది ప్రభుత్వ సలహాదారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని తెలిపింది. అయితే, ప్రభుత్వ సలహాదారుల ప్రవర్తనకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. నిర్దేశిత పనికి బదులుగా, వారు రాజకీయ ప్రచార రంగంలోకి ప్రవేశిస్తున్నారని ఫిర్యాదులు వెళ్లాయి.. ఇక, ప్రభుత్వ సలహాదారుల హోదాలో ఉండి.. ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తూ మీడియా సమావేశాలు నిర్వహిస్తున్నారని ఎన్నికల కమిషన్ గుర్తించింది. దీంతో, మంత్రికి వర్తించే విధంగా ఈ సలహాదారులకు కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని స్పష్టం చేసింది.. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఏ మాత్రం ఉల్లంఘిచినా తీవ్రంగా పరిగణిస్తాం. సంబంధిత చట్టాలకు లోబడి కఠినమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించింది కేంద్ర ఎన్నికల సంఘం. కాగా, ఏప్రిల్ 19 నుండి ఏడు దశల్లో దేశవ్యాప్తంగా పోలింగ్ నిర్వహించనుంది ఈసీ.. అరుణాచల్ ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, సిక్కిం మరియు ఒడిశా అసెంబ్లీల ఎన్నికల తేదీలను కూడా ప్రకటించిన విషయం విదితమే.. ఇక, మే 13వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా.. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు అభ్యర్థులను ప్రకటించి.. ప్రచారంలో స్పీడ్ పెంచుతున్నాయి.. ఎన్నికల ప్రచారంలో నేతల మధ్య ఆరోపణలు, విమర్శల పర్వం తారాస్థాయికి చేరుకుంది.

## సీఏఏపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు...!

ప్రతిపక్ష పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా బీహార్‌లోని పూర్ణియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మోడీ మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారు ఒక విషయం తెలుసుకోవాలని, సీఏఏ అమలు విషయంలో తాను ఎంతమాత్రం భయపడేది లేదని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని మోదీ తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో చర్యలు చేపట్టిందని, ఆర్జేడీ అధికారంలో ఉన్నప్పుడు అవక తవకల పాలన సాగించిందని ధ్వజమెత్తారు. విపక్షాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాట్లను అనుమతిస్తున్నాయని ఆరోపించారు. సీమాంచల్ చాలా సున్నితమైన ప్రాంతమని... ఓట్ బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న వారు సీమాంజల్ పూర్ణియా ప్రాంతంలో అక్రమ చొరబాట్లకు అనుమతిస్తూ భద్రతతో రాజీపడుతున్నారని ఆరోపించారు. దేశ భద్రతను గందరగోళంలో పడేసే శక్తుల పట్ల తమ ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచుతుందని మీకు భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. సీమాంచల్, పూర్ణియా అభివృద్ధికి కట్టుబడి తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. దేశంలోని 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని, వారికోసం తమ ప్రభుత్వం రేయింబవళ్లు పనిచేస్తోందని తెలిపారు. సీమాంచల్ ఏరియాలో వందే భారత్, నమో భారత్ రైళ్ల ద్వారా డపలప్‌మెంటీ కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఒక ట్రయిలర్ మాత్రమేనని, ఇప్పుడు సీమాచంల్, బీహార్, యావద్దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా పరుగులు తీయిస్తామని మోడీ భరోసా ఇచ్చారు. కాగా పూర్ణియాలో లోక్‌సభ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఇంతకుముందు ఈ సీటులో గెలిచిన పప్పూ యాదవ్ ఇక్కడ ఇండి పెండెంట్‌గా బరిలోకి దిగారు. ఇటీవలే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ తమ అభ్యర్థిగా సంతోష్ కుమార్‌ను బీజేపీ నిలబెట్టగా, బీమా



భారతిని ఆర్జేడీ నిలబెట్టింది. 40 లోక్‌సభ స్థానాలున్న బీహార్‌లో మొత్తం 7 దశల్లోనూ పోలింగ్ జరుగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 40 సీట్లలో ఎన్డీయే 39 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 17 స్థానాల్లో, జేడీయూ 16 స్థానాల్లో గెలువగా, ఎల్‌జేపీ 6 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్‌కు ఒక సీటు దక్కింది. దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. తొలి విడత ఏప్రిల్ 19న ప్రారంభం కాగా.. ఏప్రిల్ 26న సెకండ్ విడత, మే 7, 13, 20, 25, జూన్ 1న పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదల కానున్నాయి.

# నమ్మకం - ఆశ..! గెలుపు ఎటువైపు...?

ఆంధ్రప్రదేశ్ రాజకీయ వాతావరణం ఇంకా నోటిఫికేషన్ రాకముందే.. యుద్ధం మొదలై చాలా కాలం అయిందనిపించేలా ఉంది. ఒక పార్టీ వెర్సస్ ఒక కూటమి గా సాగుతున్న సమరం ఇది. నన్ను ఒక్కడిని ఓడించడానికి, ఒంటరిగా వచ్చే ధైర్యం ఏ ఒక్కరికీ లేక, మూడు జెండాలు కలిసి వచ్చాయని జగన్మోహన్ రెడ్డి అంటూ వస్తున్నారు. తమాషా ఏంటంటే.. చంద్రబాబు నాయుడు కూడా అదే మాట అంటున్నారు. జగన్‌ను ఓడించడానికి జెండాలు వేరైనా ముగ్గురం కలిసి పోటీచేస్తున్నాం అని! ఒకే వ్యవహారాన్ని ఒకే మాటలతో ప్రస్తావిస్తూ జగన్ ఒక రీతిగా ధ్వనిస్తోంటే, చంద్రబాబు అదేదో అద్భుతం అన్నట్టుగా చాటుకుంటున్నారు. మరో కోణంలోంచి చూసినప్పుడు.. ఒకవైపు తొలిసారి ముఖ్యమంత్రి అయి తన ముద్రను పదిలంగా మార్చుకోవాలని అనుకుంటున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి. రెండో వైపున- అపరిమిత అనన్యమైన రాజకీయానుభవం నా సొంతం అని చెప్పుకునే చంద్రబాబు, యూత్ లో నాకున్నంతటి క్రేజ్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరెవ్వరికీ లేదు అని చెప్పుకునే పవన్ కల్యాణ్, దేశానికి ప్రధానిగా ఉంటున్నప్పటికీ నిజానికి నాది ప్రపంచనేతల స్థాయి అని చెప్పుకునే మోడీ! ఈ రెండు వర్గాల మధ్య యుద్ధమే ఇప్పటి ఏపీ ఎన్నికలు. 2014లో కూడా ఇదే కాంబినేషన్ కదా అనిపించవచ్చు. కానీ.. వ్యక్తులు మాత్రమే అవును- అప్పటికీ ఇప్పటికీ ఆయా నాయకుల స్థాయి, తాహతు మారిపోయింది. ఎన్నికల్లో నెగ్గడం కోసం ప్రజలను ఆకట్టుకోవడానికి పార్టీలు రకరకాల ప్రకటనలు చేయడం చాలా సాధారణమైన సంగతి. రాబోయే రోజుల్లో పరిపాలించడానికి ప్రజల్లో ఒక ఆశ పుట్టించాలని పార్టీలు అనుకుంటాయి. అందుకే వరాలను ప్రకటిస్తూ ఉంటాయి. నిజానికి ఇలాంటి కొత్త వరాలను, హామీలను ప్రకటించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంతగా ఆత్రుతపడడం లేదు. 'మీ బిడ్డ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితాలు మీ ఇంటి వరకు అంది ఉంటే మాత్రమే మీరు నాకు ఓటు వేయండి.. మీ ఇంటికి అంది ఉండకపోతే నాకు ఓటు వేయనే వద్దు' అని జగన్ చెబుతున్నారు. బహుశా వర్తమాన రాజకీయ చరిత్రలో మన దేశంలోనే ప్రజలను ఇలా ఓట్లు అడిగే మరొక నాయకుడు మనకు కనిపించకపోవచ్చు. 'నన్ను నమ్మండి.. గెలిపించండి.. మీ జీవితాల రూపురేఖలు మార్చేస్తా' అని చెప్పేవాళ్లు కొల్లలుగా దొరకుతారు. కానీ 'మీ జీవితాల రూపురేఖలు ఆల్రెడీ మారిపోయిఉంటే మాత్రమే నాకు ఓటు వేయండి' అనే వాళ్లు దొరకరు. జగన్ తాను చేపట్టిన పథకాల మీద అంతటి నమ్మకంతో ఉన్నారు. చంద్రబాబునాయుడు పరిస్థితి వేరు. ఇలాంటి మాటలు చెప్పడానికి ఆయనకు ధైర్యం



చాలదు. అందుకే సరికొత్త వరాలను పుంఖానుపుంఖాలుగా ప్రకటిస్తూ వస్తున్నారు. గతంలో సీఎంగా ఉండగానే తెలుగుదేశంలోని సీనియర్ నాయకులే.. చంద్రబాబు తీరు గురించి ఒక మాట అంటూ ఉండేవారు. 'ప్రతిరోజూ పేపర్లో కనిపిస్తూనే ఉండాలని చంద్రబాబు అనుకుంటారు. ఒక్కరోజు పేపర్లో తను కనపడకపోయినా ప్రజలు మర్చిపోతారని ఆయన భయం' అనేవారు. ఆ తరహాలో ఇప్పుడు ప్రతిరోజూ ఒక కొత్త హామీ ఇస్తూ ఉంటే తప్ప, వరం ప్రకటిస్తూ ఉంటే తప్ప ప్రజలు తనను మరచిపోతారని చంద్రబాబునాయుడు ఆందోళన చెందుతున్నట్టుగా మనకు కనిపిస్తుంది. ఆయన ఏక బిగిన ఏదో ఒక కొత్త వరంతో ప్రజల ముందుకు వస్తూనే ఉన్నారు. ఆ హామీలన్నీ ఎలాంటివి? అని సూత్రీకరించదలచుకుంటే.. 'జగన్ కంటె నేను ఎక్కువ ఇస్తా' అనేది ఒక్కటే అన్నింటికీ కలిపి ఏకసూత్రంగా ఉన్న అంశం అని మనకు బోధపడుతుంది. చంద్రబాబునాయుడు తొలుత సూపర్ సిక్స్ అనే హామీలను ప్రకటించి వాటి గురించి ఊదరగొడుతూ చాలా కాలం సాగదీశారు. వాటిలో కొన్ని కొత్త ఆలోచనలు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రతి మహిళకు నెలకు రూ. 1500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు నెలకు రూ. 3000 భృతి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ, రైతుకు ఏడాదికి రూ. 20వేలు వంటివి అందులో ఉన్నాయి. కాలక్రమంలో.. జగన్మోహన్ రెడ్డి ఉద్యోగాల కల్పన చేయడం లేదనే విమర్శలను తిప్పికొట్టేలాగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ ఈలోగా ఎన్నికల ప్రకటన రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. అది ఆగిపోవడాన్ని చంద్రబాబునాయుడు చాలా తెలివిగా తన రాజకీయ ఎత్తుగడకు వాడుకున్నారు. తమ ప్రభుత్వం ఏర్పడితే వెంటనే మెగాడీఎస్సీని ప్రకటిస్తానని అన్నారు. ఇది ఒక్కటే ఆయన హామీల్లో సరైన రాజకీయ వ్యూహం. ఆరకంగా ఆయన జగన్ మీద పైచేయి సాధించారు. కానీ ఈ హామీలు సరిపోతాయో లేదోననే భయం పట్టుకుంది. అందుకే 'జగన్ కంటె ఎక్కువ ఇస్తా' అనే ప్రాతిపదికగా బోలెడు వరాలు కురిపిస్తున్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లు 3వేల నుంచి 4వేలు ఇస్తారట, అదికూడా ఏప్రిల్ నుంచి అరియర్స్ తో సహా! రెండు నెలలు తీసుకోకపోయినా.. మూడో నెలలో మొత్తం పింఛన్లు ఇస్తారట. వికలాంగులకు 4వేల నుంచి 6వేలు ఇస్తారట, వాలంటీర్లకు జీతాలు 5వేల నుంచి 10వేలు ఇస్తారట, బీసీలకు 50 ఏళ్లు వస్తే చాలు వృద్ధాప్య పింఛను జాబితాలో చేర్చేస్తారట. ఇలా ఆయన ఒకదానిని మించి మరొకటి హామీలు చెప్పుకుంటూ పోతున్నారు. ఇవన్నీ ఖచ్చితంగా లబ్ధిదారులను ఊరించే విషయాలే. చంద్రబాబునాయుడు ప్రస్తుత రాజకీయం మొత్తం 'నమ్మకం- ఆశ' అనే పదాల మధ్యనే దోబూచులాడుతోంది. చంద్రబాబు నాయుడు ఏ రకంగా నమ్మజాలని నాయకుడు అనే విషయాన్ని ప్రజల ఎదుట నిరూపించడానికి జగన్మోహన్ రెడ్డి, పాపం.. తన పాట్లు తాను పడుతున్నారు. ప్రతి బహిరంగ సభలోనూ కొన్ని నిమిషాల సమయాన్ని తెలుగుదేశం 2014 మేనిఫెస్టో మీద చర్చకే కేటాయిస్తున్నారు. అప్పట్లో చంద్రబాబు ఏమేం వరాలు ప్రకటించారో ఏకరవు పెట్టి.. అవన్నీ చేయలేదు కదా.. ఎలా నమ్మడం? అని ప్రశ్నిస్తున్నారు. మేనిఫెస్టోను ప్రకటించి.. గెలిచిన తర్వాత.. కనీసం దానిని తమ పార్టీ వెబ్ సైట్లోంచి తొలగించిన మోసగాడు చంద్రబాబు అని కూడా విమర్శిస్తున్నారు. ఏ రకంగానూ చంద్రబాబును ఎందుకు నమ్మకూడదో పదేపదే చెబుతూ ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి చెబుతున్న ప్రతి మాటా నిజమే కావొచ్చు. ఆయన రైతు రుణమాఫీని అమలు చేసిన తీరు దగ్గరినుంచి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో ఎన్నెన్ని నాటకాలు నడుస్తాయో రాష్ట్రప్రజలకు ఒక క్లారిటీ ఉంది. జగన్ అభివర్ణిస్తున్నట్టుగా 'మోసగాడు' అనే పదాన్ని ప్రతి పౌరుడూ ఫీల్ కాకపోవచ్చు గానీ.. చంద్రబాబు ఇచ్చిన వరం చేతిలో పడేవరకు నమ్మడానికి వీల్లేదనే అభిప్రాయం మాత్రం ఎక్కువమందిలో ఉంటుంది. జగన్ నుంచి సజ్జల వరకు 'చంద్రబాబు చెప్పే హామీలను ప్రజలు నమ్మరు' అనే వాక్యంతోనే ప్రస్తుతం ఎదుర్కొంటున్నారు. జగన్ 3వేలు ఇస్తోంటే చంద్రబాబు 4 వేలు ఇస్తానంటున్నాడు. చంద్రబాబునాయుడుది మొత్తం వేలంపాట రాజకీయం లాంటిదే. జగన్ ఇచ్చే ప్రతి పథకానికీ తన పాట పెంచి ప్రకటిస్తున్నాడు. మరి జనంలో ఆయన పట్ల ఉండే అపనమ్మకాన్ని, ఆ పెరిగే సొమ్ము కోసం ఉండే 'ఆశ' జయిస్తుందా? లేదా? అనేది ఇక్కడ కీలకం. అయిదేళ్ల ప్రజలు ఎన్నడూ ఊహించని మొత్తాలను ఇవాళ పింఛన్లుగా అందిస్తున్నందుకు ప్రజలు తన పట్ల విశ్వాసంతో ఉంటారనేది జగన్ కోరిక. అలాగే అమ్మఒడి వంటివి, ఆటోడ్రైవర్లకు, టైలర్లకు, న్యాయవాదులకు రకరకాల వృత్తి పనివాళ్లకు అందిస్తున్న ఆర్థికసాయాలు వంటివి కూడా పూర్తిగా తన మీద ప్రజల్లో విశ్వాసం పెంచుతాయనేది ఆయన ఆలోచన. తన ప్రభుత్వం చెప్పిన మాట నిలబెట్టుకుంటుందనే భరోసా ప్రజల్లో ఈ అయిదేళ్లలో కలిగించగలిగాను అని జగన్ నమ్ముతున్నారు. అందులో సందేహం లేదు. ప్రజల్లో ఉండే విశ్వాసమే గెలిపిస్తుంది అని ఆయన ఆశిస్తున్నారు. జగన్ పట్ల ప్రజలకు విశ్వాసం లేదనడానికి వీల్లేదు. అది టన్నుల్లోనే ఉంది. భరోసా కూడా టన్నుల్లోనే ఉంది. కానీ.. ఆ విశ్వాసంతోనే వారు ప్రవర్తిస్తారా.. చంద్రబాబు ప్రకటించిన ఊరించే తాయిలాలు, వేలంపాట లబ్ధి మీది ఆశ- జగన్ మీద విశ్వాసాన్ని కూడా కబళించేయకుండా ఉంటుందా? అనేది కీలకమైన సందేహం. చాలా సందర్భాల్లో కొన్ని అనివార్యతలు రాజకీయ నాయకుల నిర్ణయాలను శాసిస్తుంటాయి. వారు తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్తు హామీ ఇచ్చినప్పుడు.. చంద్రబాబు అనుకూలవర్గాలు అదేహామీ మనం కూడా ఇవ్వాలని ఆయనకు ఉపదేశం చేశాయి. ఆయన ఒప్పుకోలేదు. ఒప్పుకుని ఉంటే రాజకీయం ఎలా మారి ఉండేదో మనకు తెలియదు. అలాగే.. చంద్రబాబు రైతు రుణమాఫీ అన్నప్పుడు.. జగన్ అనుకూల దళాలు ఆయనకు కూడా అదే సలహా ఇచ్చాయి. 'అలాంటి ఫాల్స్ హామీలు మనం ఇవ్వకూడదు' అని జగన్ తిరస్కరించారు. 2014 ఫలితం మనకు తెలుసు. ఇప్పుడు కూడా అలాంటి ఒత్తిడి నాయకుల మీద ఉంది. అనివార్యంగా కొన్ని వరాలను ప్రకటించాల్సి ఉంటుంది. కాపీ వరాలు కాకపోయినా, వాటిని తలదన్నే వరాలను తయారుచేసుకోవాల్సి ఉంటుంది. ఈ విడత ఎన్నికలు పూర్తిగా వరాల ఎన్నికలుగా మన రాష్ట్రంలో మారబోతున్నాయి.


## ఫీడ్ బ్యాక్ టు ఆంధ్రలక్ష్మి

'ఆంధ్రలక్ష్మి' వారపత్రికకు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి.... మేము నిర్భయంగా ప్రచురిస్తాం...
మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.

Cell : 9640300529

వార్తలకై www.andhralaxmitelugu.in చూడండి

email : Andhralaxminews@gmail.com
www. andhralakshmi@gmail.com, facebook.com/andharalaxmi


## ప్రచారంలో పోటాపోటీగా...

(1వ పేజీ తరువాయి)

పోటీ చేస్తున్నారు. ఈయన మాజీ మంత్రి అనిల్‌కుమార్ అనుచరుడు. నెల్లూరు రూరల్ టిడిపి అభ్యర్థిగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి అభ్యర్థిగా ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. సర్వేపల్లి టిడిపి అభ్యర్థిగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసిపి అభ్యర్థిగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇరుపార్టీలు నువ్వానేనా అన్నట్లు ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ప్రస్తుతం నువ్వానేనా అన్నట్లు సింహపురి రాజకీయం సాగుతోంది.

# నెల్లూరు పెద్దా రెడ్లపై పోటీకి దిగిన మాజీ ఐఏఎస్ అధికారి

నెల్లూరు పార్లమెంట్ స్థానం నుంచి మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు బరిలోకి దగడం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో తెరవెనుక చక్రం తిప్పిన కొప్పుల రాజు కాంగ్రెస్ అభ్యర్థిగా తొలి సారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగారు. బలమైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు ఉద్దండులైన నాయకులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైఎస్ఆర్‌సీపీ, టీడీపీల నుంచి పోటీ చేస్తుండగా దళిత సామాజిక వర్గానికి చెందిన కొప్పుల వీరితో తలపడుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. రాజు 1981వ బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఎఎస్ అధికారి. నెల్లూరు జిల్లాతో కొప్పుల రాజుకు మంచి అనుబంధం ఉంది. నెల్లూరు జిల్లాకు కలెక్టర్‌గా పని చేస్తున్న సమయంలో పేదల కలెక్టర్‌గా కొప్పుల రాజు పేరుగడించారు. 1988 నుంచి 1992 వరకు కొప్పుల రాజు నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. దాదాపు నాలుగేళ్లు నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన కే రాజు బడుగు, బలహీన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పని చేసి అందరి మన్ననలు పొందారు. తాగు నీటి సమస్యలను తీర్చడంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి కూడా ఆయన కృషి చేశారు. ప్రత్యేకించి విద్య, వైద్యంపై దృష్టి పెట్టారు. జిల్లాలో అక్ష రాస్యత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అక్షరాస్యత కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లారు. చదువు, దాని ప్రాముఖ్యతను జిల్లా నలుమూల గ్రామాలకు కూడా వ్యాపింప చేశారు. దీని కోసం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలకు నాంది పలికారు. జిల్లాలోని కళాకారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చదువు, దాని ప్రాముఖ్యత మీద లఘు నాటకాలు, పాటలు రూపొందిండం, వాటికి నృత్య రూపకాలను జోడించి ప్రతి పల్లెకు చేరవేశారు. ఆసక్తికరమైన, శాస్త్రీయ దృక్పథ ఆలోచనలు పెంపొందించే ఇతి వృత్తాలతో కూడిన పాఠ్యాంశాలుగా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పుస్తకాలను తయారు చేయించారు. ఒక ఉద్యమంలా చేపట్టిన నెల్లూరు జిల్లా అక్షరాస్యత కార్యక్రమం నాటి ఉమ్మడి రాష్ట్రానికే ఆదర్శంగా నిలచింది. ఆ తర్వాత కాలంలో సారా వ్యతిరేక ఉద్యమం పురుడు పోసుకోవడానికి ఇది ఎంతగానో తోడ్పడింది. 1992లో నెల్లూరు జిల్లాలో సారా వ్యతిరేక ఉద్యమం ఉవ్వెత్తున లేచింది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు లభించింది. నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట దూబగుంటలో మొదలైన ఈ సారా వ్యతిరేక ఉద్యమం లావాలా జిల్లా అంతా వ్యాపించింది. ఆ గ్రామంలో సారా సమస్య తీవ్రంగా ఉండేది. అక్షరాస్యత కార్యక్రమంలో రూపొందించిన 'సిరిపురం సీతమ్మ కథ' ఆ ఊరి మహిళలను ఎంతగానో ఆలోచింప చేసింది. ఈ కథలో సీతమ్మ అనే క్యారెక్టర్ ఆ ఊరి స్త్రీలను కూడగట్టి వారి ఊర్లోకి సారా రాకుండా అడ్డుకోగలుగుతుంది. ఆ పాఠంతో దూబగుంట గ్రామం మహిళలు స్ఫూర్తిని పొందారు. దూబగుంటలో కూడా సారా లేకుండా చేసేందుకు నడుం బిగించారు. దానికి రోశమ్మ నాయకత్వం వహించింది. సారాను ఆ ఊరి నుంచి తరిమివేయడంలో కీరోల్ పోషించిన దూబగుంట రోశమ్మకు రాష్ట్ర వ్యాప్తంగా జేజేలు పలికారు. నాటి ప్రతిపక్ష నేత ఎన్టీఆర్ కూడా ఈ ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. తర్వాత కాలంలో వచ్చిన ఎన్టీఆర్ ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం ప్రకటించే స్థాయికి సారా ఉద్యమం ప్రభావం చూపింది. అలా ఈ రెండు ఉద్యమాలకు ప్రధాన కారకుడైన నాటి నెల్లూరు జిల్లా కలెక్టర్ కొప్పుల రాజు ఒక్కసారిగా హీరోగా మారారు. అలా నెల్లూరు జిల్లాతో ఆయనకు విశేష అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయనను నెల్లూరు పార్లమెంట్ నుంచి పోటీ చేయించాలని కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న కొప్పుల రాజు 2013లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి రాహుల్ గాంధీ ఆహ్వానం మేరకు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన అంతకు ముందు సోనియా గాంధీ అధ్యక్షతన గల జాతీయ సలహా మండలి సంయుక్త కార్యదర్శిగా ఢిల్లీలో పని చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి శాఖ కార్యదర్శిగా, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా, సీఎం రోశయ్య హయాంలో సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శిగాను పని చేశారు. అయితే జాతీయ సలహా మండలిలో పని చేస్తున్న సమయంలో రాహుల్ గాంధీతో రాజుకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. రాజు పనితీరు నచ్చడంతో విఆర్ఎస్ తీసుకొని పార్టీలోకి రావలసిందిగా రాహుల్ కోరడంతో రాజు విఆర్ఎస్ తీసుకొన్నారు. తర్వాత కొప్పుల రాజు ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల విభాగానికి జాతీయ సమన్వయ కర్తగా ఉన్నారు. సీడబ్ల్యూసీ శాశత్వ ఆహ్వానితుడుగా ఉన్నారు. నాటి యుపిఏ ప్రభుత్వంలో తెరపైకి వచ్చిన రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్‌టీఇ), రైట్ టు ఇన్‌ఫర్మేషన్(ఆర్‌టిఐ) చట్టాలతో పాటు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్), ఆహార భద్రత పథకాల రూపకల్పనలో క్రియాశీలక పాత్ర పోషించారు. నెల్లూరు పార్లమెంట్ స్థానం 1952లో జనరల్‌గా, 1957లో ద్విసభ్య నియోజక వర్గంగాను, 1962 నుంచి 2004 వరకు ఎస్సీ రిజర్వుడు స్థానంగా ఉండేది. 2009 నుంచి జనరల్‌గా మారింది. నెల్లూరు పార్లమెంట్



స్థానం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. 13 సార్లు కాంగ్రెస్ గెలవగా కేవలం ఒక్క సారి మాత్రమే టీడీపీ గెలిచింది. రెండు సార్లు వైఎస్ఆర్‌సీపీ గెలిచింది. 2009, 2012, 2014, ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెలవగా, 2019లో ఆదే పార్టీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ ఉద్దండులైన అభ్యర్థులను రంగంలోకి దింపారు. ఇద్దరూ రాజ్యసభ మాజీ సభ్యులు. వైఎస్ఆర్‌సీపీ నుంచి వి విజయసాయిరెడ్డి పోటీ చేస్తుండగా టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బరిలోకి దిగారు. వీరిద్దరితో కాంగ్రెస్ అభ్యర్థిగా కొప్పుల రాజు పోటీ పడుతున్నారు. విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలు ఇద్దరూ ఆర్థికంగాను, సామాజిక పరంగాను బలవంతులే. వీరితో పోలిస్తే పేరుకు మాజీ ఐఏఎస్ అధికారి కావచ్చు కానీ ఆర్థికంగా అంత స్థోమత కానీ బలమైన సామాజిక వర్గ నేపథ్యం కానీ కొప్పుల రాజుకు లేదు. ఓటములు గెలుపులు పక్కన పడితే దళిత సామాజిక వర్గానికి చెందిన కొప్పుల రాజు జనరల్ సీటుకు పోటీపడటం శుభపరిణామమని చెప్పొచ్చు.

# ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటులో తీవ్ర జాప్యం..!

జిల్లాలో కృష్ణపట్నం పోర్టు, పవర్‌ప్రాజెక్టులు, గమేషా తదితర తొమ్మిది మెగా ప్రాజెక్టులతో పాటు.. 30 భారీ పరిశ్రమలు, 7,588 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉండగా– వీటి ద్వారా రూ.49 వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయి. 60 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. వీటితో పాటు మరో 10 భారీ, మెగా పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇదంతా గత ప్రభుత్వాల హయాంలో జరిగినవే. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పరిశ్రమల సంగతి పక్కన పెడితే.. గతంలో మంజూరై, వివిధ దశల్లో ఉన్నవీ ప్రారంభానికి నోచుకోలేదు. జిల్లాలో 4,146 ఎకరాల్లో 22 పారిశ్రామికవాడలను అందుబాటులోకి తెచ్చామని చెబుతున్న అధికారులు.. వాటిలో ఏర్పాటు చేసిన పరిశ్రమలపై మాత్రం సమాధానం చెప్పే పరిస్థితిలో లేరు. జిల్లాలోని ఏ పారిశ్రామిక పార్కును చూసినా రాళ్లూరప్పలు తప్ప పరిశ్రమల జాడే కనిపించదు. పిచ్చి మొక్కల మధ్య ఏపీఐఐసీ ఏర్పాటు చేసిన బోర్డులను చూస్తే తప్ప.. అవి పారిశ్రామిక పార్కులని తెలియని దుస్థితి. ఇక మౌలిక సదుపాయాల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఉన్న వాటినే ప్రభుత్వం వెళ్లగొడుతుండటంతో.. కొత్తవి రావడం కష్టంగా మారింది. జిల్లాలో వ్యవసాయం, ఆక్వా తర్వాత పారిశ్రామిక రంగం ప్రాధాన్యమైంది. ఎంఎస్ఎంఈల ద్వారానే ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతోంది. చిన్న పరిశ్రమలు విరివిగా రావాలంటే ప్రోత్సాహకాలు, రాయితీలు అవసరం. భారీ పరిశ్రమల ఏర్పాటుతో.. వాటికి ఆర్డర్లు అందుతాయి. ఈ విషయాన్ని వైకాపా ప్రభుత్వం విస్మరించింది. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని దెబ్బతీసింది. జిల్లాలో ఇప్పటికే ఏర్పాటైన భారీ పరిశ్రమల యాజమాన్యాలను రాజకీయ కక్షతో వేధింపులకు గురిచేస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు రావాలంటేనే భయపడేలా వ్యవహరించింది. దీంతో ఎంఎస్ఎంఈల ఉనికికే ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే జిల్లాలో రైతుల నుంచి బలవంతంగా, ఉద్యోగాలు వస్తాయని మభ్యపెట్టి సేకరించిన వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయి. ఇఫ్కో ఎరువుల కర్మాగారం నిర్మిస్తామని చెప్పి.. రైతుల నుంచి 2,776 ఎకరాలు సేకరించిన సంస్థ.. కేవలం గమేషా, సీమన్స్ సంస్థలు మాత్రమే ఏర్పాటు చేసింది. ఎరువుల కర్మాగారం ఏర్పాటు చేయక పోవడంతో రైతులు పరిహారం కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో ఆ భూములన్నీ బీడుగా మారాయి. మిథాని, క్రిబ్కో వంటి భారీ పరిశ్రమలు జిల్లా నుంచి వెళ్లిపోయాయి. దీంతో 1,950 మందికి ఉపాధి లేకుండా పోయింది. పరిశ్రమలు ఏర్పాటు కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించడం అసాధ్యమని తెలిసినా.. రాష్ట్ర ప్రభుత్వం ఆది నుంచి ఉదాసీనంగా వ్యవహరించింది. వైకాపా అధికారంలోకి వచ్చీ రావడంతోనే గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలకు కేటాయించిన భూములపై సమీక్ష పేరుతో పారిశ్రామికవేత్తలను ఇబ్బంది పెట్టింది. ఆ ప్రభావం పరిశ్రమలపై పడింది. భారీ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, అనుబంధ ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమల సంఖ్య తగ్గింది. పారిశ్రామిక పార్కుల్లో భూములు ఖాళీగా ఉండటానికి ఇదే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఆత్మకూరు పరిధిలోని నారంపేట పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి 2020 సెప్టెంబరులో అడుగు పడింది. నాటి మంత్రి దివంగత మేకపాటి గౌతంరెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొదట్లో సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ వస్తుందని హడావుడి చేయగా.. అది చివరకు వైఎస్ఆర్ జిల్లా గోపవరానికి వెళ్లింది. ఆ తర్వాత ఇక్కడ పనులు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు రూ. 13 కోట్లు ఖర్చు చేయగా.. ప్రస్తుతం రూ. 23.4 కోట్ల వ్యయంతో ప్రారంభమైన రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి. విద్యుత్తు, నీటి వసతి కల్పించలేదు. ఒక్క మంచి పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడలేదు. ఇటీవల స్థానిక ప్రజాప్రతినిధి సామిల్లు, చెక్క ఫర్నిచర్ తయారీకి ముందుకొచ్చారని, వారితో ఒప్పందాలు చేసుకున్నామని ప్రకటించడంతో స్థానికులు విస్తుబోతున్నారు. కావలి మండలంలో మెగా ఇండస్ట్రియల్ హబ్ కలగానే మిగిలింది. రామాయపట్నం ఓడరేవుకు అనుసంధానంగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చెన్నాయపాళెం, అనెమడుగు, తుమ్మలపెంట గ్రామాల పరిధిలో 2001.78 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి 2020లోనే అధికారులు సర్వే చేశారు. గ్రామసభలు జరిగాయి. ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. ప్రభుత్వం నుంచి డబ్బు రాకపోవడంతో ఆలస్యమైందని కావలి ప్రజలు చర్చించుకుంటున్నారు. బొడ్డువారిపాళెం, కొత్తపల్లి కౌరుగుంట గ్రామాల్లో 42.15 ఎకరాలు, 49.89 ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేశారు. రూ. కోట్లు ఖర్చు చేసి.. రోడ్లు వేయడంతో పాటు సుమారు 500 ప్లాట్లు అభివృద్ధి చేశారు. ఇప్పటి వరకు అక్కడ కేటాయించిన ప్లాట్ల సంఖ్య కనీసం వంద దాటలేదు. భూములు తీసుకున్నవారు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతం పిచ్చి చెట్లతో నిండిపోగా– రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. పరిశ్రమలు వస్తే.. తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో.. భూములు ఇచ్చిన రైతులు ఇప్పుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సీఎంపై రాయి విసిరిన ఘటనలో భద్రతా వైఫల్యం సుస్పష్టం

సీఎం జగన్‌పై రాయి విసిరిన ఘటనలో భద్రతా వైఫల్యం సుస్పష్టంగా కనిపిస్తోంది. దాడికి ముందు, ఆ తర్వాత భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరు అత్యంత లోపభూయిష్ఠంగా ఉంది. వివేకానంద స్కూల్ వైపు నుంచే రాయి వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వీడియోల్లోనూ అలానే కనిపిస్తోంది. సాధారణంగా సీఎం ప్రయాణించే మార్గంలో ఎత్తయిన భవనాలను ముందే గుర్తించి, అక్కడ పోలీసులను మోహరిస్తారు. వీఐపీ వచ్చే ముందుగా ఆ మార్గంలో ఒకటికి రెండు సార్లు భద్రతా తనిఖీలు చేస్తారు. రెండంతస్తుల భవనంలో ఉన్న వివేకానంద స్కూల్ గదుల తలుపులు తెరిచే ఉన్నాయి. ఆ భవనమంతా ఖాళీగానే ఉంది. అయినా అక్కడ ఎందుకు భద్రతా సిబ్బందిని పెట్టలేదు? భద్రతా తనిఖీల్లో దాన్ని ఎందుకు విస్మరించారు? జగన్ పర్యటిస్తున్న మార్గంలో ముందస్తుగా డ్రోన్ ఎగరవేసి.. ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ 360 డిగ్రీల కోణంలో చిత్రీకరించి, భద్రతా పరంగా ఎక్కడైనా సమస్యలున్నాయా అనేది క్షుణ్ణంగా గమనిస్తుంటారు. మరి అలాంటిది వివేకానంద స్కూల్ భవనం లోపల నుంచి గానీ, భవనం పైనుంచి గానీ ఎవరైనా, ఏదైనా విసిరితే ముప్పు ఉండే అవకాశముందని ముందే ఎందుకు గుర్తించలేదు? వీఐపీ భద్రత పట్ల ఇది నిర్లక్ష్యం కాదా? 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కోసం శనివారం చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై గుంటూరు-విజయవాడ మధ్య, ఇటు విజయవాడ నగరంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిపేసి ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం చూపించారు. జగన్ సర్వీసురోడ్డులో మధ్యాహ్న భోజనం కోసం ఆగితే... జాతీయ రహదారి మీద కూడా వాహనాల్ని నిలిపేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్న పోలీసులు.. భద్రతాపరంగా మాత్రం ఎందుకు అప్రమత్తంగా లేరనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. జగన్ పర్యటనకు రెండు రోజుల



ముందే అక్కడ పర్యటించిన పోలీసులు.. దుకాణాలన్నీ మూసివేయాలని ఆదేశించారు. మరి అప్పుడే భద్రతాపరంగా ఎక్కడెక్కడ సమస్యలున్నాయో ఎందుకు గుర్తించలేదు? జగన్‌పై రాయి విసిరినప్పుడు విద్యుత్తు సరఫరా లేదు. అలాంటప్పుడు భద్రతా సిబ్బంది ఫోకస్ లైట్లు వేసి వారికి చుట్టుపక్కల ప్రాంతాలన్నీ కనిపించేలా చూసుకోవాలి. కానీ అదీ చేయలేదు. ముఖ్యమంత్రి బస్సుపై నిలుచుని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్నప్పుడు చుట్టూ ఉండే భద్రతా సిబ్బంది డేగకళ్లతో అన్ని వైపులా గమనిస్తుండాలి. ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే రక్షణ వలయంగా ఏర్పడి కాపాడాలి. ముఖ్యమంత్రిపై రాయి విసిరిన ఘటన జరిగి 24 గంటలు దాటిపోయినా.. ఆదివారం రాత్రి వరకూ పోలీసులు ఏమీ ప్రకటించలేదు. డీజీపీ కేవీ రాజేంద్రనాథరెడ్డి, నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, విజయవాడ నగర పోలీసు కమిషనర్ కాంతిరాణా ముగ్గురూ వైకాపాకు వీరవిధేయులే. భద్రతా వైఫల్యానికి ప్రధాన బాధ్యత వీళ్లదే. సీపీ కాంతి రాణా అయితే.... చిన్న చిన్న విషయాలకూ ప్రెస్‌మీట్లు పెట్టి వివరాలు చెబుతుంటారు. అలాంటిది ఇంత పెద్ద ఘటన జరిగితే ఆయన నుంచి అధికారికంగా ఎలాంటి స్పందనా లేదు. వైకాపా నాయకులు ఆరోపిస్తున్నట్లు ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులే రాయి విసిరారని అనుకుంటే, ఈ పాటికే నిందితుడెవరో తేల్చేయాలి కదా! ఎందుకు తేల్చలేకపోతున్నారు? ఇంత పెద్ద ఘటన జరిగితే... డీజీపీ, నిఘావిభాగం అధిపతి, విజయవాడ సీపీ ఎవరూ దానిపై నోరు విప్పట్లేదు. ఈ ఘటనపై అధికార, విపక్ష నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు. వాస్తవమేంటో ఆధారాలతో తేల్చాల్సిన బాధ్యత పోలీసులదే కదా! వాళ్లు దర్యాప్తులో ఎందుకింత జాప్యం చేస్తున్నారు? అత్యంత క్లిష్టమైన కేసుల్ని సైతం సాంకేతికతను ఉపయోగించేసి ఛేదిస్తున్నామని చెప్పుకొనే ఏపీ పోలీసులు.. ఈ దాడి ఘటనలో ఇప్పటివరకూ ఏం నిగ్గుతేల్చారో ఎందుకు స్పష్టత ఇవ్వట్లేదు? విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. జగన్‌కు పదునైన రాయి తగలి రక్తగాయమైందని, అదే రాయి పక్కనే ఉన్న తన ఎడమ కంటికి తగిలి తనకూ రక్తగాయమైందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. వైకాపా నాయకులు మాత్రం ఎయిర్‌బుల్లెట్, పెల్లెట్, క్యాట్‌బాల్ వంటి వాటితో కొట్టారని ఆరోపిస్తున్నారు. అసలు వాస్తవమేంటి? ముఖ్యమంత్రి నుదుటిపై తగిలింది ఏంటో ఇప్పటివరకూ పోలీసులు తేల్చలేదు. అసలు తగిలిన వస్తువును స్వాధీనం చేసుకున్నారో, లేదో కూడా స్పష్టత లేదు. దర్యాప్తు రీత్యా ఇది చాలా అవసరం. నిజంగా వైకాపా నాయకులు ఆరోపిస్తున్నట్లు పెల్లెట్, ఎయిర్ బుల్లెట్ అయితే ఈ పాటికే వాటిని చూపించాలి కదా! కానీ అవెక్కడా చూపించట్లేదు. అయితే ముఖ్యమంత్రి నుదుటిపై తగిలిన గాయం చూస్తే అది తగిలిన గాయంలా కనిపించట్లేదని ఫోరెన్సిక్ నిపుణులు చెబుతున్నారు. రాయి వల్ల గాయమైతే.. అది దాని పరిమాణాన్ని బట్టి 25పైసల నాణెం పరిమాణం నుంచి ఎంతైనా వృత్తాకారంలో ఉంటుందని విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో అత్యున్నత స్థాయి భద్రత ఉండేది ముఖ్యమంత్రికే. అలాంటి వీఐపీకి రాయి తగిలితే భద్రతా సిబ్బంది, పోలీసులు దాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ముందు వీఐపీ చుట్టూ వలయంగా ఏర్పడి స్టోన్‌గార్డులు, బుల్లెట్ ప్రూఫ్ షీట్లు తెరవాలి. వీఐపీని సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లాలి. రాయి తగిలినా సీఎం చుట్టూ భద్రతా సిబ్బంది వలయంగా ఏర్పడలేదు. రాయి వచ్చిన వివేకానంద స్కూల్ ప్రాంతాన్ని మొత్తం చుట్టుముడితే రాయి విసిరినవారిని పట్టుకునేందుకు అవకాశం ఉండేది. కానీ అక్కడ ఉండే వందల మంది సిబ్బంది ఎవరూ ఈ దాడిని గుర్తించలేదు, తక్షణం స్పందించలేదు.

# ప్రలోభాలకు గురిచేస్తే.. తప్పదు భారీ మూల్యం..!

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియమావళి అమలు కఠినతరం చేశారు. త్వరలో నామ పత్రాల స్వీకరణ పర్వం కూడా మొదలు కానుంది. పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఓ పక్క ప్రచారం సాగిస్తునే.. మరో పక్క ప్రలోభాల ఎర వేయడానికి సమాయత్తం అవుతున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం తీవ్రమైన నేరం. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, భారత శిక్షాస్మృతి చట్టాల కింద కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే జరిమానా, లేదా జరిమానాతో పాటు శిక్షకు కూడా గురవుతారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2019లో జరిగిన ఎన్నికల్లో నిబంధనలు మీరిన ఘటనలపై 84 కేసులు నమోదయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రలోభాల ఎర ఎలా ఉంటే.. శిక్షలు ఎలా నమోదవుతాయన్న అంశాన్ని పరిశీలిస్తే.. ఎన్నికలంటే డబ్బు తరువాత మద్యం గుర్తుకొస్తుంది. ప్రతి గ్రామంలోనూ రాజకీయ పక్షాలు మద్యం పంపిణీ చేస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి మూడు సీసాలకు మించి మద్యం తీసుకెళ్లడం నేరం. ఓటర్లకు పంపిణీ చేసేందుకు భారీ మోతాదులో మద్యం రవాణా చేస్తూ పట్టుబడుతుంటారు. ఇలా దొరికితే అబ్కారీ చట్టం 1968 సెక్షన్ 34(ఎ) కింద కేసు నమోదు చేస్తారు. దీనికిగాను ఆరు నెలల నుంచి ఏడాది వరకు శిక్ష, రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది. ఓటర్లను తమ వైపునకు తిప్పుకొనేందుకు అభ్యర్థులు ప్రధానంగా నగదు ఎరగా వేస్తారు. అక్రమ చెల్లింపులు చేయడం ప్రధానం. పలు రకాలుగా పంపిణీలు జరుపుతుంటారు. ఇలా చేస్తే ఐపీసీ 171(హెచ్) కింద చర్యలుంటాయి. అధికారులకు లంచం రూపంలో డబ్బులిచ్చినా, ఓటర్లకు డబ్బులు పంచినా



ఐపీసీ 171(బి) సెక్షన్ కింద చర్యలు తీసుకుంటారు. అభ్యర్థులకు కేటాయించిన సమయాన్ని మాత్రమే వినియోగించుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా మైకులు, డీజేలు వాడడం, వివిధ రకాల ప్రచార సామగ్రి వినియోగించడం కూడదు. దీనికి గాను ఐపీసీ 171(ఎఫ్) చట్టం కింద చర్యలు తీసుకుంటారు. ప్రతి ఓటరుకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే హక్కు ఉంది. ఈ విషయంలో ఎవరూ జోక్యం చేసుకోకూడదు. ఓటర్లను ఒత్తిడికి గురిచేయడం, బెదిరించడం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. ఇలా చేసినట్లు రుజువైతే బాధ్యులపై ఐపీసీ 171(సి) చట్టం కింద కేసు నమోదు చేస్తారు. ప్రచారం చేసే అభ్యర్థులు ప్రజలను ఆకర్షించేందుకు ఒక్కోసారి అబద్ధాలను చెబుతుంటారు. లేనిది ఉన్నట్లు ప్రచారం చేస్తుంటారు. దీనిపై ప్రత్యర్థులు ఫిర్యాదులు చేస్తే, రుజువైతే ఐపీసీ 171(జి) కింద కేసు నమోదు చేస్తారు. ఇప్పటికే పలు చోట్ల పలు వర్గాలకు కానుకలు పంపిణీ చేస్తున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. ఓటర్లకు నేరుగా ప్రలోభానికి గురి చేస్తూ కానుకలు పంపిణీ చేయడం నేరం. అన్నదానాలు, వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయకూడదు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ఐపీసీ171(ఇ) చట్టం కింద శిక్షార్హులవుతారు. ఓట్ల కోసం కులం, మతం, సామాజిక వర్గాలను రెచ్చగొట్టేలా పలువురు వ్యాఖ్యలు చేస్తుంటారు. ఎదుటి వ్యక్తుల మనోభావాలను కించపరచడం చేస్తారు. ఇలా జరిగినట్లు, నిబంధనలు ఉల్లంఘన గమనించినట్లయితే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద కేసు నమోదు చేస్తారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలు ఎన్నికలు ముగిసిన నెలలోగా అందించాలి. లేకుంటే ఐపీసీ 171(ఐ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు.

# లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళిక విడుదల

## అలవికాని వాగ్దానాలు చేటే...!

లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళిక (మ్యానిఫెస్టో)ని న్యాయపత్ర పేరిట విడుదల చేసింది. 24పేజీల ఈ ప్రణాళికలో కాంగ్రెస్ తమ పార్టీ అధికారంలోకి వస్తే అమలు జేయబోయే పథకాలనూ,కార్యక్రమాల గురించి సవివరంగా తెలియజేసింది. ముఖ్యంగా, ప్రజలకు ఐదుగ్యారంటీలను ఇచ్చింది. ఈ ప్రణాళిక లో ఐదు న్యాయాలు ఉన్నాయి. యువకులు, మహిళలు, రైతులు, శ్రామికులు,అల్పసంఖ్యాక వర్గాలకు న్యాయం చేకూ రుస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ ప్రణాళికలో కొత్త దనం ఏమీ లేదు. కర్నాటక,తెలంగాణ అసెంబ్లి ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలనే ఇందులో పొందుపర్చారు. ఆ గ్యారంటీల వల్ల ఆ రెండు రాష్ట్రాలలో పార్టీకి ప్రజలు పట్టం కట్టడం వల్ల వాటిపై సెంటిమెంట్‌తోనే ఈ ప్రణాళికలో చేర్చి ఉంటారు. మాజీ కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం నేతృత్వంలో మ్యానిఫెస్టో కమిటీ దీనిని రూపొందించింది. ఈ దేశాన్ని ఎక్కువ కాలం పరిపా లించిన కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్తగా వాగ్దానాలను ఇవ్వాల్సిన అవసరం లేదు.కానీ, ఎన్నికల ముందు మ్యానిఫెస్టోని విడుదల చేయడం ఆనవాయితీ కనుక విడుదల చేశారు.ఎన్నికల ప్రణాళిక అనేది ఒక నమూనా మాత్రమే. దానిని మించి కార్యక్రమాలనూ, పథకాలను అమలు జేసిన ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రజలకు ఆ విషయంలో నమ్మకం కుదిరితే ఈ వాగ్దానాల గురించి పట్టించుకోరు. ఈ ప్రణాళికలో పేర్కొన్న వర్గాలే కాకుండా ఇంతవరకూ ఎటువంటి సాయం పొందని వర్గాలు సమాజంలో అనేకం ఉన్నాయి. ఎన్నికల ముందు విడుదల చేసే ప్రణాళికలను అధికారంలోకి వచ్చిన తర్వాత చాప చుట్టేయడం వల్లనే వాటికి విలువ తగ్గిపోతోంది. పార్టీల ప్రతిష్ట దిగజారుతోంది. తమ పార్టీ అధికారంలోకి వస్తే కులగణనను అమలు జేస్తామని ఈ ప్రణాళికలో కాంగ్రెస్ వాగ్దానం చేసింది. కులగణన అనేది మాజీ ప్రధానులైన నెహ్రూ, ఇందిరాగాంధీల సిద్ధాంతాలకు వ్యతిరేకమని పార్టీ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ ఇప్పటికే విమర్శించారు. అలాగే, రిజర్వే షన్ల పరిధిని 50 శాతం మించి పొడిగిస్తామంటూ కాంగ్రెస్ వాగ్దానం చేసింది. ఇది అమలు చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే,రిజర్వేషన్ల పరిమితిని పెంచాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. రాజ్యాంగ స వరణ చేయాలంటే కాంగ్రెస్‌కి పార్లమెంటులో మూడిం ట రెండు వంతుల మెజారిటీ రావాలి. ప్రస్తుత పరిస్థితిలో అంత పెద్ద మెజారిటీ ఆ పార్టీకి వచ్చే అవకాశం లేదు. ఆ పార్టీ పోటీ చేస్తున్నదే నాలుగువందల సీట్ల లోపు. ప్రస్తుత అధికార పార్టీ అయిన బీజేపీ కూడా నాలుగువందల స్థానాలను లక్ష్యంగా పెట్టుకుంది కానీ, అన్ని సీట్లు ఆ పార్టీకి వచ్చే అవకాశం లేదు. దేశంలో ప్రాం తీయ పార్టీల జోరు పెరిగింది. అందువల్ల కాంగ్రెస్,బీజేపీలలో ఏది అధికారంలో వచ్చినా, ప్రాంతీయ పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందే. కానీ, ప్రస్తుతం ఉన్న వాతావరణంలో అంత పెద్ద మెజారిటీ జాతీయ పార్టీలతో ఏర్పాటయ్యే సంకీర్ణ కూటములకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ముఖ్యమైనది అప్రెంటిస్‌షిప్‌కి సంవత్సరానికి లక్షరూపాయిల స్టయిఫండ్ ఇస్తామన్నది. ఇది కూడా అలవి కాని వాగ్దానమే. డిప్లొమాలు పొందిన సాంకేతిక విద్యా పట్టభద్రులకు పరిశ్రమల్లో అప్రెంటిస్‌షిప్‌లు దొర కడం కష్టంగా ఉంది. ప్రభుత్వం నుంచి భూములు,చౌక రేట్లకు విద్యుత్, నీరు వంటి మౌలిక సదుపాయాలను పొందుతున్న పారిశ్రామికవేత్తలు అప్రెంటిస్‌షిప్‌లకు ఈ డిప్లొమా హొల్డర్లను తీసుకోవడం లేదు. రాజకీయంగా పలుకుబడి కలిగిన వారి సిఫార్సులుంటేనే అప్రెంటిస్ షిప్ లభిస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి ప్రభుత్వ హయాంలో కూడా ప్రైవేటు పరిశ్రమల్లో ఉద్యోగార్థులకు అప్రెంటిస్‌షిప్‌లు లభించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో కూడాఇదే పరిస్థితి. మార్చి 31 వరకూ లక్ష రూపాయిల విద్యా రుణాన్ని మాఫి చేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. రుణాల మాఫీ ఎన్నికల్లో ఓట్లు దండుకోవ డానికే ఉపయోగపడుతోంది. రైతులకు రుణ మాఫీ విషయంలో కాంగ్రెస్,బీజేపీ వంటి జాతీయ పార్టీలే కాకుండా, ప్రాంతీయ పార్టీలు సైతం ఈ వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోతున్నాయి. రుణ మాఫీ విషయంలో యూపీఏ తొలివిడత ప్రభుత్వం అమలు జేసిందికానీ, మిత్ర పక్షాలు సహకరిం చకపోవడం వల్ల దానిపై కూడా విమర్శలు వచ్చాయి. అందువల్ల వాగ్దానాల అమలు అంత సులభం కాదు. ఒక్క కాంగ్రెస్ మాత్రమే కాదు, దానిని గద్దె దించి అధికారంలోకి వచ్చిన బీజేపీ కూడా వాగ్దానాల అమలు విష యంలో చతికిల పడుతోంది. ఉచితాలను సుప్రీంకోర్టు, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలు వ్యతిరేకిస్తున్న దృష్ట్యా అమలు జేయగల వాగ్దానాలను మాత్రమే చేయడం అందరికీ శ్రేయస్కరం.

## జైలు భయంతో ఇద్దరు నేతలు..
## ఈ ఎన్నికతో ఎన్ని అనర్థాలు చూడాలో..!?

ఎండ వేడి కంటే ఎన్నికల వేడి ఎక్కువై పోతున్నది. పందెం కోళ్ల వలె పౌరుషాలు ప్రదర్శిస్తున్నారు – జగన్, చంద్రబాబులు. ఇద్దరి మాటల్లో తీవ్రత హెచ్చింది. వారి నోటి వెంట తిట్లు గంగా ప్రవాహం వలె ప్రవహిస్తున్నాయి శపథాలు, శాపనార్థాలు నిప్పుతునకల వలె ఎగసి పడుతున్నాయి. గెలవాలి, ఎట్లయినా గెలవాలి, గెలుపు తప్ప మరొక మార్గం లేదు, గెలుపు కోసం ఏమైనా చేయాలి అన్న ధోరణిలో వుంది వారి ఎన్నికల సమరం తీరు. గెలవకుంటే, అధికారంలోకి రాకుంటే జైలుకు వెళ్లాలన్న భయం ఇద్దరిలో కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నది. జగన్ గెలిస్తే – చంద్రబాబు మీద పెట్టిన అరడజను కేసుల కథ కారాగారానికి చేర్చడం ఖాయం. రాష్ట్ర ప్రభుత్వ కేసులు కాబట్టి అది ఆయన చేతిలో పని. ఇప్పటికే ఒకసారి రాజమండ్రి జైలు నివాసంలో నరకం అనుభవించిన చంద్రబాబు మరొకసారి ఆ వూహ కూడా తట్టుకొనే స్థితిలో లేదు. తాను గెలవకుంటే, మళ్లీ అధికారంలోకి రాకుంటే, తన గతి అదే అన్న నిజం ఆయనకే కాదు, ఆయన పరివారం మొత్తానికి తెలుసు. అందుకోసం ఊపిరి బిగపట్టి సర్వశక్తులూ ధార పోస్తున్నారు. ఏ ఎత్తు, ఏ జిత్తు వదలి పెట్టడం లేదు. ఎవరితో రాజీకైనా వెనుకాడడం లేదు. పవన్ కళ్యాణ్, బిజెపిలతో తెలుగుదేశం పొత్తు నిర్ణయం వెనుక ఈ భయం దాగి వుంది. సీట్లు తగ్గినా ఫర్వాలేదు, సంకీర్ణమైనా నష్టం లేదు, అధికారం మాత్రం తనది కావాలనే తలంపుతో చంద్రబాబు నాయుడు తనకు అలవాటు లేని పోకడలు పోతున్నారు. పవన్‌ను పవర్ స్టార్ అని పొగుడుతున్నారు, మోడీని దార్శనికుడిగా అభివర్ణిస్తున్నాడు. ఇందుకు ఏ మాత్రం తీసిపోవడం లేదు జగన్. ఆయనకూ జైలు భయం వుంది. అప్పుడెప్పుడో సిబిఐ పెట్టిన 11 కేసుల కత్తి మెడ మీద వేలాడుతూనే వుంది. తాను ముఖ్యమంత్రిగా వున్న ఐదేళ్లలో ప్రతి నిర్ణయమూ ఒక కేసుగా మార్చడం సులభం. ఇసుక, మద్యం, భూముల కేటాయింపు వంటి వాటిలో నిర్దిష్టమైన ఆధారాలు కూడా దొరుకుతాయి. పాత కేసులకు కొత్త కేసులు జతైతే, జీవితం మొత్తం జైలులోనే గడచి పోతుంది. భరించలేని ప్రమాదం అది. ఆ గండం గట్టెక్కాలంటే, మళ్లీ అధికారంలోకి రావాలి, గెలవాలి. దానికోసం దేన్నీ వదలదలచడం లేదు. ఎంతకైనా తెగించే ధోరణిలో వుంది ఆయన ఎన్నికల నిర్వహణ తీరు. నమ్ముకొన్న నరేంద్ర మోడీ నట్టేట ముంచుతాడని కల కూడా కనలేదు జగన్. చంద్రబాబుతో ఆయన ఎన్నికల దోస్తీ ఊహ కూడా చేయలేదు. మూడోసారి ప్రధాని కాబోతున్న మోడీ జతలో చంద్రబాబు వుంటే ఎటువంటి విపరిణామాలు తటస్థిస్తాయో జగన్‌కు బాగా తెలుసు. రెండు ప్రధాన పార్టీ నేతలూ తీవ్రమైన మానసిక ఆందోళనతో ఎన్నికల సమరంలో తలపడడం రాష్ట్రానికి ఎంత మాత్రం మంచి చేయదని నిక్కచ్చిగా చెప్పవచ్చు. గెలుపు కోసం తెగింపు చూపే పరిస్థితులలో ఎటువంటి అనర్థాలు జరుగుతాయో అన్న భయం నెలకొంటున్నది. రాయలసీమ ఫ్యాక్షన్ చరిత్ర మరొకసారి పునరుత్థానం చెందుతుందా అన్న అనుమానం పొడసూపుతున్నది. ఇప్పటికే వైఎస్ షర్మిల కడప జిల్లాలో ఉద్రిక్తతలు పెంచుతున్నది. జగన్ మీద ఆమె చేస్తున్న విమర్శలు, ఆరోపణలు తీవ్రాతి తీవ్రమైనవి. ఒక ముఖ్యమంత్రిని నేరుగా హంతకుడని, హంతకులను కాపాడేవాడని నిందిస్తున్నారు. మహిళగా ఆమె ప్రదర్శిస్తున్న ధైర్యం అసాధారణమైనది. ఈ చర్యకు ప్రతిచర్య ఏమిటి, ఏ రూపంలో వుంటుందన్నది తలచుకొంటేనే గుండెలు గుబేల్ మంటున్నాయి. ఆమె పోరాట శైలి వల్ల కడప జిల్లా రాజకీయాల బలాబలాలను వైఎస్ కుటుంబం పంచుకొనే పరిస్థితి ఏర్పడితే, పరిణామాలు తీవ్రంగా వుంటాయని చెప్పవచ్చు. ఏది ఏమైనా ఈసారి ఎన్నికల వల్ల రాష్ట్రానికి ప్రమాదమే తప్ప, ప్రమోదం ఏ కోశానా కన్పించడం లేదనేది మేధావుల అభిప్రాయంగా వుంది.

## నాలుగో దశ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల..
## ఏపీ, తెలంగాణలో నామినేషన్లకు సన్నద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

దిల్లీ: నాలుగో దశ సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. ఏపీ, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలు సహా 10 రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. దీంతో రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ 25 తుదిగడువు. 26న నామినేషన్ల పరిశీలన, 29వరకు ఉపసంహరణకు తుది గడువుగా పేర్కొన్నారు. 21వ తేదీ ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఎంపీ అభ్యర్థుల నుంచి కలెక్టర్ ఛాంబర్‌లో, ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నారు. నామినేషన్ వేసే వ్యక్తితో పాటు మరో నలుగురిని మాత్రమే ఆర్వో ఛాంబర్‌లోకి అనుమతిస్తామని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు మే 13న పోలింగ్ జరగనుంది. జూన్4న ఫలితాలు వెల్లడికానున్నాయి. అభ్యర్థులు ఒక్కొక్కరు నాలుగు సెట్ల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఈసీ అవకాశం కల్పించింది. లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలుకు సంబంధించి 200 మంది రిటర్నింగ్ అధికారులను వేర్వేరుగా నియమించారు. నామినేషన్లకు ఏడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆ లోగా దాఖలు చేసేందుకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ వేయనున్నట్టు ప్రకటించారు.

## ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పర్యవేక్షణలో జిల్లా పోలీసు యంత్రాంగం నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు 30 పోలీసు యాక్ట్‌ను అమలులోకి తీసుకువచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ నామినేషన్ కేంద్రాల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి, లోక్‌సభ నామినేషన్ కేంద్రం వద్ద అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. నామినేషన్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో అభ్యర్థుల ఊరేగింపులు నిలిపివేయనున్నారు. నెల్లూరు ఎంపీ నామినేషన్ కేంద్రం వద్ద అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్యను, నెల్లూరు అర్బన్ : నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, నెల్లూరు గ్రామీణం : సీసీఎస్ డీఎస్పీ రామకృష్ణాచారి, కోవూరు : ట్రాఫిక్ డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, సర్వేపల్లి: నెల్లూరు గ్రామీణ డీఎస్పీ వీరాంజనేయరెడ్డిని నియమించారు. ఆత్మకూరు : డీఎస్పీ ఎన్.కోటారెడ్డి, కావలి : డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి : దిశ డీఎస్పీ టి.సాయినాథ్, కందుకూరుకు డీఎస్పీ ఎ.శ్రీనివాసులును కేటాయించారు.

# ఫేక్ ఐడీలతో టార్చర్..! పెరుగుతున్న కేసులు....!

పరువు తీసేలా ప్రచారాలు.. వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మెసేజ్‌లు.. ఇప్పుడు కొంతమంది మహిళలకు ఈ సమస్య తలనొప్పి తెచ్చిపెడుతోంది. గత కొంతకాలంగా తరచూ ఇటువంటి వేధింపులతో తలలు పట్టుకుంటు న్నారు మహిళలు, యువతులు. సోషల్ మీడియా వేదికగానే సాగుతున్న ఈ టార్చర్ భరించలేక పోలీసులను ఆశ్రయిస్తున్నారు. అసలు దీని వెనుక ఉన్నది ఎవరన్న దానిపై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించారు. డిజిటల్ యుగం వైపు ప్రపంచ పరుగులు పెడుతోంది. మొబైల్ ఫోన్‌కు ఇంటర్నెట్ కనెక్ట్ ఉంటే చాలు, అరచేతిలో ప్రపంచమంతా ఇమిడిపోతూ ఉంటుంది. ఏ ప్రాంతం నుంచి ఎక్కడికైనా సమాచారం పంపాలన్నా.. ప్రపంచంలోనే ఎక్కడి సమాచారాన్ని అయినా తెలుసుకోవాలనుకున్నా డిజిటల్ యుగంలో సోషల్ మీడియా అత్యంత ప్రభావంతంగా సేవలందిస్తోంది. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు చూస్తే అంతా సోషల్ మీడియా వేదికగానే నేరాలు ఊపందుకున్నాయి. సోషల్ మీడియాను నేరగాళ్లు తమకు అస్త్రంగా మలుచుకుంటున్నారు. సైబర్ నేరాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ప్రధానంగా మహిళలు, యువతులే టార్గెట్‌గా చేసుకుని తప్పుడు ప్రచారాలు అసభ్యకరమైన మెసేజ్‌లు హడలెత్తిస్తున్నాయి. ఏ సమయంలో ఎవరి వంతు వస్తుందేమోనని మహిళలు, యువతులు భయపడిపోతున్నారు. ప్రధానంగా వర్కింగ్ ఉమెన్లు, కార్యాలయాలు, కంపెనీల్లో పనిచేసే మహిళలు, విద్యార్థులు ఇటువంటి నేరలకు బాధితులుగా మారుతుండడం ఇప్పుడు ఆందోళన కలిగిస్తుంది. ఓ యువతి విశాఖ హెచ్‌పీసీఎల్‌లో మంచి పొజిషన్‌లో పనిచేస్తోంది. ఫేక్ ఇమెయిల్‌తో యువతికి వేధింపులు మొదలయ్యాయి. ఉద్యోగిని పట్ల అసభ్యంగా మెసేజ్‌లు, తప్పుడు ప్రచారం ఊపందుకుంది. చెక్ చేస్తే శత్రువులు



ఎవరూ లేరు ఆమెకు. మరి ఎవరు ఇలా చేస్తున్నారు..? ఎంత గింజుకున్నా అంతు పట్టలేదు. మరోవైపు కెమికల్ కంపెనీలో ఇటువంటి ఘటనే జరిగింది. ఉద్యోగిని పరువు మర్యాదలు పోయేలా మెసేజ్‌లతో ప్రచారం సాగుతోంది. దీంతో ఆ ఉద్యోగిని డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. ఇక మరో మహిళకు ఇంస్టాగ్రామ్‌లో వేధింపులు మొదలయ్యాయి. ఫ్రెండ్ రిక్వెస్ట్ చెక్ చేసిన పాపానికి.. ఆమెకు టార్చర్. ఇక ఓ యువతికి పెళ్లి కుదిరింది. ఆమె చాలా సౌమ్యురాలు. కానీ ఆమె పట్ల అసభ్య ప్రచారం మొదలుపెట్టారు సైబర్ కేటుగాళ్ళు. ఓ యువతి ప్రైవేటు కంపెనీలో మంచి పొజిషన్‌లో పనిచేస్తోంది. ఆ యువతకి సోషల్ మీడియాలో వేధింపులు మొదలయ్యాయి. అసభ్య ప్రచారాలు టార్చర్. ఆమెకు శత్రువులు ఎవరూ లేరు. ఎంత గించుకున్న అవతలి వాళ్ళు ఎవరో అంత పట్టలేదు. దీంతో ఆ యువత డిప్రెషన్ లోకి వెళ్లిపోయింది. ఇక మరో యువతికి కూడా ఇటువంటి హరాస్‌మెంట్. కాబోయే భర్తకు షాకింగ్ మెసేజ్‌లు పెడుతూ ఆమె పరువు తీసేలా ప్రచారం. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే.. ఇంకా ఇటువంటి ఘటనలకు నిత్యం మహిళలు గురవుతూనే ఉన్నారు. అయితే ఈ అన్ని కేసుల్లోనూ.. అవతలి వ్యక్తి ఎవరో వీళ్ళకు తెలియదు. పోనీ తెలుసుకుందామన్నా సరే అంటూ పట్టదు. ఎందుకంటే వాళ్లంతా సోషల్ మీడియాలో ఫేక్ ఐడీలు క్రియేట్ చేసి, ఈ మెయిల్స్ ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్‌ల ద్వారా ఈ హరాస్‌మెంట్ చేస్తున్నారు. రోజురోజుకీ పెరుగుతున్న వేధింపులతో బాధితులంతా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ కు క్యూ కడుతున్నారు. రోజుకి ఇద్దరూ ముగ్గురు తమ బాధను చెప్పుకునేందుకు సైబర్ క్రైమ్ పోలీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. హెచ్‌పీసీఎల్ ఉద్యోగినికి అసభ్య మెసేజ్‌లతో వేధిస్తున్న తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు.. కడప జిల్లాకు చెందిన మల్లికార్జున నాయక్ అనే యువకుడిని గతేడాది అరెస్టు చేశారు. ఇన్‌స్ట్రాగ్రామ్‌లో.. వేధింపులకు గురి చేస్తున్న కేసులో కాకినాడకు చెందిన యువకుడని పట్టుకున్నారు. మరికొన్ని కేసులను చేధించి నిందితులను కటకటాల వెనక పెట్టారు. తాజాగా ప్రైవేట్ కంపెనీలో యువతీకి హరాస్‌మెంట్ కేసులో.. అదే కంపెనీలో మాజీ ఉద్యోగిని తాజాగా అరెస్టు చేశారు పోలీసులు. అయితే ఈ అన్ని కేసులోనూ ఇన్వెస్టిగేషన్ చేసిన పోలీసులకు... షాకింగ్ నిజాలు తెలుసుకుంటున్నారు. పోలీసులే కాదు, ఎందుకు ఎవరో తెలిసి బాధితులు కూడా షాక్‌కు గురవుతున్నారు. ఎందుకంటే బాధితులకు నిందితులు ఇంతకుముందే పరిచయస్థులుగా ఉండడం విశేషం. నిందితుల్లో చాలామంది ఉన్నత చదువులు చదువుతున్న వారే. తమకున్న పరిజ్ఞానంతో ఫేక్ ఈమెయిల్ ఐడీలు ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ఐడీలు క్రియేట్ చేసి హరాస్‌మెంట్ చేస్తున్నారు. అనుకున్న యువతి తమకు దక్కలేదనో.. కంపెనీలో జెలసితోనో... వేధింపులకు గురి చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇటీవల హెచ్‌పీసీఎల్ ఉద్యోగినికి వేధించిన వ్యక్తి గౌహతి ఐఐటీలో చదుకోవడం విశేషం. అయితే కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులు కూడా నిందితులుగా ఉంటున్నారు. ఓ కేసులో తన మరిదిపై ఈ దారుణానికి పాల్పడింది వదిన. తాను ఇష్టపడని వ్యక్తిని పెళ్లి చేసుకోబోతుడంతో స్వయానా వదిన ఆ యువతిపై తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఇక మరో కేసులో మరో నిందితుడు కంప్యూటర్స్‌లో గ్రాడ్యుయేట్ సిస్టమ్స్ పై మంచి పట్టు. ప్రాక్సితో విపిఎన్ క్రియేట్ చేసి అత్యంత చాకచక్యంగా హరాస్‌మెంట్ చేస్తున్నాడు. అయితే సోషల్ మీడియా వినియోగించే యువతులు మహిళలు కూడా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చూపిస్తున్నారు నిపుణులు. ఈ మధ్యకాలంలో నమోదు అవుతున్న ఉమెన్ వేధింపుల కేసుల్లో.. చాలావరకు తెలిసిన వాళ్లు, ఇదివరకు పరిచయస్తులే విలన్లుగా తేలుతుండడం ఆందోళన కలిగించే విషయం. ఇటువంటి తప్పుడు ప్రచారాలతో చాలామంది బాధితులు ఆత్మహత్య చేసుకునే అంత స్థాయికి కూడా వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. ఇటువంటి సందర్భాల్లో బాధితులు సకాలంలో తమను ఆశ్రయించి ఫేక్ గాళ్ళ భరతం పట్టేందుకు సహకారం అందించాలని కోరుతున్నారు సైబర్ క్రైమ్ పోలీసులు. అందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

# ఉద్యోగులు వినియోగిస్తున్న ప్రైవేటు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న ఎన్నికల నిధులు..!



పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేటు వాహనాలను వినియోగిస్తూ వాటిమీద ఆన్‌డ్యూటీ ప్రభుత్వ వాహనాలుగా బోర్డులు తగిలించుకొని రవాణా సాగిస్తున్నారు. ఆయా వాహనాలను ఎన్నికల సిబ్బంది తనిఖీ చేయడంలేదనే వాదనలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులంతా ఆయా ప్రాంతాల్లో రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే పని చేస్తున్నందువల్ల ప్రలోభాలకు గురై నాయకుల వల్ల లబ్దిపొంది అక్రమంగా ఎన్నికల నిధులు ఆన్‌డ్యూటీ వాహనాల్లో తరలిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరం నుండి తరలిపోయే టప్పుడు, నగరంలోకి ప్రవేశించేటప్పుడు ప్రతి కూడలి స్థానంలో వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది ఈ ఆన్‌డ్యూటీ వెహికల్స్‌ను, అదేవిధంగా రెవిన్యూ, పోలీస్, ట్రాన్స్‌పోర్టు, విద్యుత్ లాంటి అనేక శాఖలకు చెందిన సిబ్బంది తమ సొంత వాహనాలకు శాఖకు సంబంధించిన బోర్డులు తగిలించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఎన్నికల సమయంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు ఈ వాహనాలను మాత్రం తనిఖీ చేయడంలేదు. ఈ వాహనాల్లో కూడా ఎన్నికల నిధులు అక్రమంగా తరలిపోతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయనాయకుల కనుసన్నల్లో పనిచేసే పలువురు అధికారులపై కొరడా ఝుళిపించిన ఎన్నికల కమిషన్ ఈ వాహనాల తనిఖీలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపి అక్రమంగా ఎన్నికల నిధులు తరలిపోతున్నాయా? లేదా అనే వాస్తవం వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా వుంది. పరస్పరం రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటూ ఎన్నికల్లో అధిక నిధులు వెచ్చిస్తున్నారన్న ఆరోపణలు గుప్పిస్తున్నారు. అయితే ఈ అధిక నిధులు ఏ మార్గంలో తరలివెళ్లి ఆయా శ్రేణులకు అందుతున్నాయో తెలియని ప్రశ్న. ఈ దశలో ఆన్‌డ్యూటీ వాహనాలుగా చలామణి అవుతున్న పలువురు ప్రభుత్వ ఉద్యోగుల ప్రైవేటు వాహనాల్లో ఈ అక్రమ ధనం తరలిపోతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరోపణలు ఎలా వున్నా... ఎన్నికల కమిషన్ తన ఎన్నికల నిర్వహణలో అక్రమాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. శాంతిభద్రతల పర్యవేక్షణలోనూ, ఎన్నికల వ్యయం కట్టడి చేయడంలోనూ, ఓటుకు నోటు కొనసాగకుండా చూడటంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు భావిస్తున్నారు. ఏది ఏమైనా ఈ ప్రభుత్వ ఉద్యోగులు ఉపయోగిస్తున్న ప్రైవేటు వాహనాల్లో ఎన్నికల నిధులు అక్రమంగా తరలిపోతున్నాయా? లేదా అనే విషయం పరిశీలించాలని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అన్నివిషయాలలో కఠినంగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్ ఈ విషయాల్లో కూడా తగు జాగ్రత్త తీసుకొని అక్రమంగా తరలిపోతున్న నల్లధనం గుట్టు రట్టుచేయాలని మేథావి వర్గం అభిప్రాయ పడుతోంది.

# నిబంధనలు ఉల్లంఘిస్తే అంతే...!



జిల్లాలో ఎన్నికల ప్రచారాలు ఊపందుకున్నాయి. పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల ప్రవర్తనా నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ను అధికారులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను నియమించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. బ్యాంకుల లావాదేవీలపై కూడా ఓ కన్నేసి ఉంచుతున్నారు. పార్టీలు, అభ్యర్థులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు సైతం నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రచారాల్లో ఇవి తగవు.. మతపరమైన ప్రార్థనా మందిరాల్లో కులం, మతం, ప్రాంతం, వర్గ, జాతి భేదాలు తదితర సున్నితమైన అంశాలతో ప్రచారం చేయరాదు. ప్రజా జీవితానికి ఇబ్బంది కలిగేలా ఊరేగింపుతో వెళ్లరాదు. అనుమతి ఉన్న వాహనాల్లో మాత్రమే ప్రచారాలు చేయాలి. ఇందులో ఐదుగురి కంటే ఎక్కువ మంది ప్రయాణించకూడదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, మైదానాల్లో అనుమతి లేకుండా ప్రచారాలు చేయకూడదు. ప్రైవేటు స్థలాల్లో చేసేందుకు ఇంటి, స్థల యజమాని, ఎన్నికల అధికారి అనుమతులు తీసుకోవాలి. ప్రచారాల్లో మద్యం పంపిణీ పూర్తిగా నిషేధం. ప్రజల మధ్య శత్రుత్వం పెరిగేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదు. కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అధికారులు విస్తృత తనిఖీలు చేస్తుంటారు. వాహనాలు ఆపి పూర్తిగా పరిశీలిస్తారు. దీనికి అభ్యంతరం పెట్టే అధికారం ఎవరికీ లేదు. వాటిల్లో నిషేధిత వస్తువులు ఉంటే స్వాధీనం చేసుకుంటారు. పరిమితికి మించి లెక్కలు, ఆధారాలు చూపని నగదు, మద్యం ఉంటే వాహనంతో సహా సీజ్ చేస్తారు. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ఇప్పటికే జిల్లాలో 18 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సభలు, సమావేశాలు, ప్రదర్శనలకు ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించరాదు. పోలింగు రోజు ఓటర్ల రవాణాకు ఎలాంటి వాహనాలు ఉపయోగించకూడదు. ఎన్నికల ఫలితాలపై సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ నిషేధం. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదు. పోలింగు కేంద్రాల్లోకి అక్రమంగా ప్రవేశించడం, ఈవీఎంలు, ఇతర దస్త్రాలు తొలగించడం నేరం. రహస్య ఓటింగ్ పద్ధతికి, ఇతరుల సభలు, సమావేశాలకు భంగం కలిగించటం, ప్రదర్శనలతో ట్రాఫిక్ అంతరాయం కలిగించకూడదు. తప్పుడు ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌కు అనుమతి లేదు. తాత్కాలిక, శాశ్వత ఉద్యోగ నియామకాలు చేపట్టకూడదు. కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు అధికారులను సమీక్షలు, సమావేశాలకు పిలవకూడదు. పోలింగు 48 గంటల ముందు ప్రచారాలు పూర్తిగా ఆపేయాలి. నామినేషన్లు వేసేటప్పుడు మూడు వాహనాల్లో మాత్రమే రావాలి. ఐదుగురికి మాత్రమే ఈఆర్వో కార్యాలయంలోకి అనుమతి ఇస్తారు. న్యాయస్థానం ఆదేశాలు ఉన్న ఉద్యోగ నియామకాల ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. కరవు నివారణ పనులు చేపట్టవచ్చు. కరవు ప్రాంతాల్లో ఆహార సరఫరా చేయవచ్చు. ఎన్నికల సంఘం అనుమతితో మంచినీటి సరఫరా, ఖైదీల విడుదల, గిట్టుబాటు ధరల నిర్ణయం తీసుకోవచ్చు. అభ్యర్థి ప్రచారానికి టోపీలు, మాస్కులు వగైరా ఇవ్వొచ్చు. ప్రత్యర్థి పార్టీ విధి విధానాలను విమర్శించొచ్చు. రాజకీయ పార్టీలు ముందస్తు అనుమతితో ఊరేగింపులు, ర్యాలీలు చేసుకోవచ్చు.

# పేదోడు పేదోడుగానే... పెద్దోడు పెద్దోడిగానే...!

భారతదేశం బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందనీ, త్వరలో ఐదు ట్రిలియన్ డాలర్లకు చేరుకొని ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంటుందనీ, దేశంలో కుల రాజకీయాలు చేయొద్దని, మన దేశంలో ఉన్నది రెండే రెండు వర్గాలని ఒకటి పేదలు రెండవ వారు పేదలను ఉద్ధరించే వారని పదే పదే చెబుతున్నారు. అయితే దేశంలో పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. సమాజం కులాల పరంగా, మతాల పరంగా విడిపోయి దేశంలో 28 కోట్ల మంది ప్రజలు అర్ధాకలితోనూ, 21 కోట్ల మంది అనారోగ్యాలతోనూ, కోట్లాది మంది నిరుద్యోగంతోనో ఉన్నారని అనేక ఆర్థిక నివేదికలు తెలియజేస్తున్నాయి. మన ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం మహిళల 80 శాతం మందికి రక్తహీనత, 30 శాతం మంది అవిద్యతో, 80 శాతం మంది స్త్రీలు ఎటువంటి నైపుణ్యాలు లేక అతి తక్కువ వేతనాలతో దేశంలో ఉన్నారు. ఇటీవలే అంతర్జాతీయ శ్రామిక సంస్థ నివేదిక ప్రకారం మన దేశంలో యువత 83 శాతం మంది ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎంత దుర్భరంగా ఉన్నాయో బోధపడుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులు ఈ సదుపాయాలు ఎందుకు కల్పించలేక వాటిపై పెట్టుబడులు పెట్టలేకపోతున్నారో, తాము అధికారంలోకి వచ్చేందుకు ఉచిత పథకాలపై ఖర్చు చేస్తూ



ప్రజలను ప్రలోభ పెడుతున్నారో తీసుకోవాల్సిన పరిస్థితి ఆసన్నమైనది. దేశంలో బ్రతుకుతెరువు లేక మన దేశ పౌరులు ప్రపంచ దేశాల్లో 3.7 కోట్ల మంది విదేశీ పౌరసత్వాన్ని తీసుకున్నారు. వీరందరూ ఉపాధి అవకాశాలు ఈ దేశంలో లేనందువలన వలస బాట పట్టిన వారే. ఈ వలస బాటలో మన దేశ కోటీశ్వరులు కూడా ఉన్నారు. 2013 -22 మధ్యకాలంలో 48,500 మంది కోటీశ్వరులు విదేశీ పౌరులుగా మారిపోయారు. మనదేశంలో నూతన ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరిస్తున్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వలన మన ఆర్థిక వ్యవస్థ స్వేచ్ఛా వాణిజ్య పోటీ మార్కెట్ నుంచి గుత్త పెట్టుబడిగా తర్వాత నేటి కార్పొరేటీకరణ వరకు ప్రభుత్వ మద్దతుతోనే కొనసాగుతూ పెట్టుబడిదారీ వ్యవస్థగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తూ ఉన్నది. ప్రపంచీకరణ తొలి రోజుల్లో (1991) భారత్‌లో పదిమంది కూడా లేని బిలినియర్ల సంఖ్య తాజా లెక్కల ప్రకారం 200కు చేరింది. ప్రభుత్వమంటే పెట్టుబడిదారీ వ్యవహారాలను చక్కబెట్టే యంత్రంగా మిగిలిపోవడం వల్లే నేడు దేశంలో పేదరికం, నిరుద్యోగం విలయ తాండవం చేస్తున్నాయి. వెనుకబడిన కులాలు ఈ అభివృద్ధిలో పాలు పంచుకో లేనందువలన పేదరికం, నిరుద్యోగం ప్రబలమైపోతున్నది. నేడు దేశంలో ఆదాయ అసమానతలు బ్రిటిష్ వలస పాలనలో కన్నా ఎక్కువగా ఉన్నాయని అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నివేదికలు తెలియజేస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న జీడీపీ ఎవరి జేబుల్లోకి పోతున్నది. 2022 లో 22.6% జాతీయ ఆదాయం ఉన్నత ఆదాయ వర్గాల ఒకే ఒక్క శాతం దగ్గర ఉన్నది. 1951లో ఈ ఒక్క శాతం జనాభా దగ్గర ఉన్నది 11.5% మాత్రమే. 1980 నాటికి 6 శాతానికి తగ్గిపోయినది. ఇలా ఆదాయాలని లబ్ధి పొందిన వారెవరు. అదే విధంగా ఉన్నత ఆదాయ వర్గం 10 శాతం జనాభా చేతిలో 1951లో 36.7 శాతం కాగా 2022 నాటికి 57.7% పెరిగిపోయినది. ఇలా ఆదాయాలని దక్కించుకున్న వారు ఎవరు? ఉన్నత కులాలవారా? దీనికి భిన్నంగా 2022 లో 50 శాతం జనాభా చేతిలో జాతీయ ఆదాయం కేవలం 15 శాతం మాత్రమే ఉంది. అయితే 1951లో ఈ 50 శాతం జనాభా వాటా 20.6 గా ఉన్నది. ఇలా పేదలు నిరుపేదలుగా మారడం, మిలియనీర్లు బిలియనీర్లుగా మారడం మన దేశంలోనే జరుగుతున్నది. 2019లో మన ప్రధానమంత్రి మోడీ ప్రకారం దేశంలో రెండే రెండు కులాలు ఉన్నాయి. అవి పేదలు, రెండవది పేదలను అభివృద్ధి పరిచేవారు. అలా ఆనాడు అన్న ఆయన 2024లో ఇప్పుడు దేశంలో నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయి అవి ఒకటి స్త్రీలు, రెండు యువత, మూడు రైతులు, నాలుగు పేదలు అని అంటున్నారు. కులాల ద్వారా కులాల వలన కులాల చేత పాలన చేసే రాజకీయం వద్దంటున్నారు. పేదలను గుర్తించండి అని వారి అభివృద్ధికి పాటుపడాలని అంటున్నారు. దేశంలో ఎక్కువగా హింసకు గురవుతున్నది మహిళలే అని తద్వారా వారు ఆరోగ్యవంతమైన మానసిక స్థితి లేక నివాస సదుపాయాలు లేక నిరసించి పోతున్నారని అభిప్రాయపడ్డారు. పేదలు, పేదరికం ఈ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయని వీరి అభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి జరుగుతుందని మన ప్రధానమంత్రి వాదన. ఆధునిక ప్రజాస్వామిక, లౌకిక మార్గాల్లో భారతదేశాన్ని నిర్మించాలంటే కుల ఆధారిత హిందూ సమాజానికి, దాని సంస్కృతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం అవసరమని గ్రహించాలి. భారతదేశ సనాతన నాగరికత, సంస్కృతి కోటలు బీటలు పారందే సమ సమాజాన్ని నిర్మించలేం. పేదరికాన్ని నిర్మూలించలేం. 6400 కులాలు, ఆరు మతాలు, 1618 భాషలు, 29 రకాల పండుగలు ఉన్నటువంటి దేశంలో భిన్నత్వ కోణంలోనే కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని పేదరికం, నిరుద్యోగం, ఆదాయ అసమానతలను నిర్మూలించగలం.

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha Cell : 9640300529